

ప్రభుత్వ విద్యావ్యవస్థ తీరు రోజురోజుకు దిగజారుతోంది. రూ.కోట్లు వెచ్చిస్తున్నా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నా సర్కారీ చదువులు మాత్రం చతికిల పడుతున్నాయి. ప్రభుత్వ బడులు, కళాశాలల్లో చేరికల శాతాన్ని పెంచేందుకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ప్రవేశాలు మాత్రం పెరగడం లేదన్నది సుస్పష్టం. ప్రైవేటు విద్యాసంస్థల్లో జరుగుతున్న అడ్మిషన్లను చూసేత సర్కారు విద్య పరిస్థితేంటో అర్థమవుతోంది. అయితే మెడికల్, ఇంజనీరింగ్ విద్య విషయంలో మాత్రం అందుకు భిన్నంగా ఉంటోంది. ఎక్కువ మంది ప్రభుత్వ కళాశాలల్లోనే చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇక అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న ఖమ్మంలో జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు ప్రతిపాదన ఎప్పటినుంచో ఉంది. గురువారం జిల్లా పర్యటనకు రానున్న ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారాణా వీటిపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సర్కారీ చదువులు చతికిల!

- ఏటికేడు దిగజారుతున్న ప్రభుత్వ విద్యావ్యవస్థ తీరు
- ఉమ్మడి జిల్లాలో విద్యాలయాల్లో అనేక సమస్యలు
- ప్రభుత్వ మెడికల్, ఇంజనీరింగ్ విద్య పట్ల ఆసక్తి
- పాఠశాలలు, కళాశాలలపై మాత్రం ప్రజల్లో అనాసక్తి
- ఖమ్మానికి యూనివర్సిటీ కల ఎప్పటికి నెరవేరేను?

ఖమ్మం, జూలై 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పిల్లలను చేర్చేందుకు నై అంటున్న తల్లిదండ్రులు.. అదే ప్రభుత్వ మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్ల కోసం సై అంటున్నారు. అందుకు ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో ఉన్న పరిస్థితులే కారణమని తెలుస్తోంది. సౌకర్యాలున్నచోట కూడా అడ్మిషన్లు జరగకపోవడం గమనార్హం. ప్రతీ ఏటా బడిబాట, తదితర కార్యక్రమాలపై సరైన దృష్టి పెట్టకపోవడం లాంటివి ప్రధాన కారణాలుగా చెబుతున్నారు. ప్రైవేటు పాఠశాలలు, కాలేజీల్లో విద్యార్థుల సంఖ్యతో పోలిస్తే ప్రభుత్వ విద్యాలయాల్లో తీవ్ర వ్యత్యాసం కనిపిస్తోంది. సమర్థులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులు, మధ్యాహ్న భోజనం, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, దుస్తులు, నోటుపుస్తకాలు ఇలా ఎన్ని సౌకర్యాలు కలిపిస్తున్నా ప్రభుత్వ చదువులపై ఆసక్తి సన్నగిల్లడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఖమ్మంజిల్లాలో విద్యావ్యవస్థ తీరుపై ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారాణా గురువారం సమీక్ష నిర్వహించబోతున్న నేపథ్యంలో పలు సమస్యలు తెరపైకి వస్తున్నాయి.



ఖమ్మం జిల్లాలో పరిస్థితిదీ..

ఉదాహరణకు ఖమ్మం జిల్లాలో 1312 ప్రభుత్వ పాఠశాలల్లో లక్ష మంది చదువుతుంటే.. కేవలం 282 పాఠశాలల్లో 90వేల మంది వరకు చదువుతున్నారంటే ప్రభుత్వ బడులు, కాలేజీల పరిస్థితేంటో అర్థం చేసుకోవచ్చు. ఇక ప్రభుత్వ 21 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 9,600 మంది ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతుంటే.. 22ప్రైవేట్ కాలేజీల్లో 25,440 మంది చదువుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎంసెట్,నీట్‌కు కోచింగ్ ఇవ్వకపోవడం, కోచింగ్ మెటీరియల్ అందించకపోవడం, కెరీర్ గైడెన్సు లేకపోవడం లాంటి కారణాలతో విద్యార్థులు ప్రైవేటు కాలేజీల వైపు మొగ్గుచూపుతున్నారు కొందరు విద్యార్థులు ప్రభుత్వ కాలేజీల్లో (మిగతా 6వ పేజీలో)

జేఎన్‌టీయూ సమస్యలు తీరేనా..?

యోగితారాణా తన సమీక్షలో పాలేరు జేఎన్‌టీయూ సమస్యలపైనా చర్చించాలన్న డిమాండ్ వినిపిస్తోంది. గత కేసీఆర్ ప్రభుత్వంలో ఖమ్మానికి జేఎన్‌టీయూ కళాశాల మంజూరుచేయగా.. మద్దులపల్లిలో ఐటీడీఏకు చెందిన ఒకేషనల్ కేంద్రంలో తాత్కాలికంగా కళాశాలను ప్రారంభించారు. అది జరిగి రెండేళ్లవుతున్నా శాశ్వత భవనాలు, ల్యాబులు, అధ్యాపకులు లేకపోవడంతో జేఎన్‌టీయూ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. త్వరలో మూడో విద్యాసవంవత్సరం కూడా ప్రారంభం కానున్న నేపథ్యంలో జేఎన్‌టీయూ సమస్యలను పరిష్కరించేలా చర్చించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఇప్పటికే ఇక్కడ చదువుతున్న విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను చూస్తున్న వారు జేఎన్‌టీయూ కళాశాలలో చేరేందుకు జంకుతున్నారు. రెండో కౌన్సెలింగ్‌లో కళాశాలను మార్పుచేసుకుంటున్నారు. ఫలితంగా ఈఏడాది మొదటి సంవత్సరం సీట్లు సగం మాత్రమే నిండే పరిస్థితి కనిపిస్తోంది. ప్రిన్సిపాల్ ఒక్కరే పూర్తిస్థాయి ఉద్యోగిగా ఉండగా మిగిలినవారు తాత్కాలిక సిబ్బంది ఉన్నారు. శాశ్వత భవనం కోసం ప్రభుత్వం 41ఎకరాల భూమిని కేటాయించగా.. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పట్టుబట్టి గతేడాది డిసెంబరులో రూ.108.60కోట్లు మంజూరు చేయించారు. కానీ జేఎన్‌టీయూ అధికారుల నిర్లక్ష్యంతో ఇప్పటి వరకు టెండర్లు పూర్తిచేయలేదు. జెన్‌టీయూ పాలకవర్గం కూడా దీనిపై దృష్టిపెట్టకపోవడంతో పరిస్థితి మరింత జటిలంగా మారుతోంది. ఐటీడీఏ ట్రైనింగ్ సెంటర్‌లోనే కళాశాల, హాస్టల్ ఉండగా.. బాలికల హాస్టల్‌ను దూరంగా ఏర్పాటు చేశారు. అక్కడ తాగునీరు, మరుగుదొడ్ల సమస్య వారిని వేధిస్తోంది.

ఎర్త్‌సైన్స్ వర్సిటీని ప్రపంచ స్థాయిలో తీర్చిదిద్దాలి

- ఆగస్టులో సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- ఈ విద్యాసంవత్సరం నుంచి యూజీ, పీజీ కోర్సులకు శ్రీకారం
- మూడేళ్లలో భవనాల పూర్తిస్థాయి నిర్మాణం
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- కొత్తగూడెంలో యూనివర్సిటీ ప్రారంభోత్సవ సన్నాహక సమావేశం
- హాజరైన ఇన్‌చార్జ్ వీసీ, విద్యాశాఖ ఉన్నతాధికారులు



ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కొత్తగూడెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రపంచం గర్వించేలా కొత్తగూడెంలోని డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ రూపుదిద్దాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉన్నతాధికారులకు సూచించారు. బుధవారం ఆయన తొలుత వర్సిటీ ఆవరణలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో యూనివర్సిటీ ప్రారంభోత్సవ సన్నాహక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం అక్కడే విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది ఆగస్టులో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ యూనివర్సిటీని ప్రారంభిస్తామన్నారు. అలాగే ఈ విద్యా సంవత్సరం నుంచే యూజీ, పీజీ స్థాయిలో బీఎస్సీ జియాలజీ, బీఎస్సీ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఎమ్మెస్సీ జువాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ కోర్సులు ప్రారంభించాల్సి ఉందని, ఇందుకోసం తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు సూచించామన్నారు. ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి, విదేశాల్లోని ప్రఖ్యాత విశ్వ విద్యాలయాలను సందర్శించి అధ్యయనం చేసి వాటి ఆధారంగా మౌలిక సదుపాయాలు, కోర్సుల రూపకల్పన చేయాలని నిర్ణయించామన్నారు. రాబోయే మూడేళ్లలో పూర్తిస్థాయి విశ్వవిద్యాలయ భవనాల నిర్మాణం పూర్తిచేస్తామని, అంతేకాక విద్యార్థులకు పరిశోధనలో ప్రోత్సాహం కల్పిస్తూ ఉద్యోగ అవకాశాలు పొందేలా యూనివర్సిటీని తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. దీని కోసం ఆర్‌యూఎస్‌ఏ నిబంధనల ప్రకారం నిధుల సమీకరణ చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యారంగానికి కీలక అధికారులంతా సమావేశంలో పాల్గొని ప్రపంచంలో మొట్టమొదటి డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ స్థాపనకు అవసరమైన చర్యలు, కోర్సులు, విద్యార్థుల సంఖ్య లాంటి అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఖనిజ సంపదకు కేంద్రంగా నిలుస్తోందని, జిల్లాలోని ఖనిజ వనరులను సమర్థవంతంగా వినియోగించేందుకు ప్రత్యేక ప్రణాళిక అవసరమని పేర్కొన్నారు. కలెక్టర్ ఇప్పటికే ఒక నివేదికను తయారు చేసి (మిగతా 6వ పేజీలో)



భద్రాచలం సబ్ కలెక్టర్‌గా మృనాల్ శ్రేష్ట

భద్రాచలం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం రెవెన్యూ డివిజన్ నూతన సబ్ కలెక్టరుగా బిహార్ రాష్ట్రానికి చెందిన మృనాల్ శ్రేష్టను నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.2023 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆరుగురికి పోస్టింగ్‌లు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు జీవో జారీ చేశారు. 2024న ఏప్రిల్ 15 నుంచి కొంతకాలం పాటు ఖమ్మంలో నాటి కలెక్టర్ వీపీ గౌతమ్ వద్ద మృనాల్ శ్రేష్ట ట్రెయినీ ఐఏఎస్‌గా పని చేశారు. శిక్షణ కాలం పూర్తి కావడంతో ఆయన భద్రాచలం రెవెన్యూ డివిజన్ సబ్‌కలెక్టరుగా తొలి పోస్టింగ్ పొందారు. 2024 మార్చి 4 నుంచి ఇప్పటి వరకు రెవెన్యూ డివిజనల్ అధికారిగా బాధ్యతల్లో ఉన్న దామోదర్‌రావు బదిలీ అయ్యారు. అయితే భద్రాచలం సబ్‌కలెక్టరుగా బాధ్యతలు చేపడుతున్న మృనాల్ శ్రేష్ట 37వ ఐఏఎస్ అధికారిగా నిలిచారు. 1957లో భద్రాచలం రెవెన్యూ డివిజన్ ఆవిర్భవించగా నాటి నుంచి నేటి వరకు 98మంది ఐఏఎస్, ఆర్డీవో ర్యాంకు అధికారులు బాధ్యతలు నిర్వహించారు. 99వ అధికారిగా మృనాల్ శ్రేష్ట కానున్నారు. సమస్యలను పరిష్కరించడంలో చొరవ తీసుకుంటారనే మంచి పేరుంది.

గంజాయి ఉచ్చులో మైనర్లు!



- జల్సాలకు అలవాటు పడి కేసుల పాలు
- సత్తుపల్లి ప్రాంతంలో యథేచ్ఛగా విక్రయాలు
- ఒడిస్సా నుంచి సరుకు దిగుమతి
- రెండు రోజుల్లో రెండు కేసులు నమోదు చేసిన పోలీసులు

సత్తుపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : సత్తుపల్లి పట్టణం, పరిసర ప్రాంతాల్లో మళ్లీ గంజాయి గుప్పుమంటోంది. ఈ మహమ్మారి ఉచ్చులో పడుతున్న వారిలో మైనర్లు కూడా ఉంటుండటం గమనార్హం. గతేడాది పెద్ద సంఖ్యలో గంజాయి విక్రేతలు, గంజాయి సేవించే వారిని గుర్తించి వారికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చిన విషయం అప్పట్లో సంచలనం కలిగించింది. మళ్లీ ఇప్పుడు సత్తుపల్లి గంజాయి విక్రేతలు పోలీసులకు చిక్కారు. గంజాయి విక్రయం, తాగుతున్న వారిపై నిఘా పెట్టిన పోలీసులు రెండు రోజుల వ్యవధిలో రెండు కేసులు నమోదు చేయగా.. యువకులు, మైనర్లు లక్ష్యంగా కొందరు గంజాయిని విక్రయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రెండు రోజుల్లో రెండు కేసులు..

సత్తుపల్లి పట్టణంలో పోలీసుల తనిఖీల్లో గంజాయి విక్రేతలు పట్టుబడ్డారు. రెండు రోజుల క్రితం సత్తుపల్లి మండలం రేజర్లకు చెందిన జుంజునూరి సింహాద్రి అలియాస్ సందీప్, మరో ఇద్దరు మైనర్ల నుంచి స్థానిక వ్యవసాయ మార్కెట్ గోడౌన్ వద్ద పోలీసులు దాడి చేసి 632 గ్రాముల గంజాయి, సెల్ ఫోన్లు, మోటార్ సైకిల్ సీజ్ చేశారు. మంగళవారం వేంసూరు రోడ్డులోని అర్బన్ పార్కు సమీపంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఒక మైనర్ గంజాయితో పట్టుబడ్డాడు. అతని వద్ద ఉన్న ఏడున్నర కిలోల గంజాయి ఉండగా.. ఈ సంఘటనలో మరో ఇద్దరు ప్రమేయం ఉందని పోలీసులు గుర్తించారు. ఆ మైనర్లను జువైనల్ జస్టిస్ బోర్డు ముందు హాజరుపరిచారు.

ఒడిస్సా నుంచి గంజాయి తెచ్చి..

గంజాయిని ఒడిస్సా రాష్ట్రం నుంచి కొనుగోలు చేసి రాష్ట్రాల సరిహద్దులు దాటించి చిన్నచిన్నప్యాకెట్లుగా చేసి సత్తుపల్లి పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. గతేడాది కూడా పలువురు ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్ నుంచి గంజాయిని తెచ్చి ఈ ప్రాంతంలో విక్రయించినట్లు ప్రచారం జరిగింది. ప్రధానంగా కొందరు జల్సాలకు అలవాటు పడి చేతి ఖర్చులకు కూడా ఈ వ్యాపారాన్ని ఎంచుకుంటున్నారని తెలుస్తోంది. కొందరు గంజాయి బారిన పడి కొనుగోలు చేసే ఆర్థిక స్థోమత లేక చోరీలకు కూడా పాల్పడుతున్నారని పోలీసులు చెబుతున్నారు. గంజాయి విక్రేతలు ప్రధానంగా ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్నారు. ఇందులో యువత, మైనర్లు ఉండటంత ఆందోళన కలిగిస్తోంది.

గతేడాది ఇలా

గంజాయి విక్రయం చేస్తున్నారని, పీలుస్తున్నారని గతేడాది అక్టోబర్‌లో సత్తుపల్లి పోలీసులు కొందరిని అదుపులోకి తీసుకుని విచారించారు. కొందరు ఏపీ నుంచి గంజాయి కొనుగోలు చేశారని, మరికొందరు దాన్ని పీల్చారని నిర్ధారించుకొని 11మందిని అరెస్టు చేశారు. వారి నుంచి 5.84కిలోల గంజాయి కూడా స్వాధీనం చేసుకున్నట్టు అప్పట్లో పోలీసులు ప్రకటించారు. విచారణలో భాగంగా గంజాయి తాగే వారిని 82 మందిని (మిగతా 7వ పేజీలో)

కాంగ్రెస్‌లోకి కొండబాల?

- త్వరలో చేరికకు రంగం సిద్ధం
- అనుచరులతో మంతనాలు!
- భవిష్యత్‌పై భట్టి హామీ ఇచ్చినట్టు ప్రచారం



వైరా / మధిర, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మధిర మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు త్వరలోనే 'కారు'దిగి అధికార 'హస్తం' అందుకోబోతున్నట్టు విశ్వసనీయ సమాచారం. దీంతో ఖమ్మం జిల్లాలో ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగలనున్నట్టు తెలుస్తోంది. త్వరలోనే కొండబాల కాంగ్రెస్ చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారని, మూడు రోజుల క్రితమే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో మంతనాలు జరిగాయని, ముహూర్తం చూసుకొని కాంగ్రెస్‌లో చేరతారని, ఈ క్రమంలో కొండబాల రాజకీయ భవిష్యత్‌పై భట్టి హామీ ఇచ్చారని ప్రచారం జరుగుతోంది. 30ఏళ్లుగా కొండబాల, భట్టి విక్రమార్క వేర్వేరు పార్టీల్లో కొనసాగుతున్నా.. వారి మధ్య వ్యక్తిగతంగా (మిగతా 6వ పేజీలో)

వాడీవేడిగా కేఎంసీ కౌన్సిల్ సమావేశం

- పలు అంశాలపై విస్తృత చర్చ
- ఒక్కో పనికి 11సార్లు టెండర్లా?
- వాగ్వాదానికి దిగిన బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్లు
- సముదాయించిన మేయర్, కమిషనర్
- ఉద్యోగులకు వరాల జల్లు కురిపిస్తూ పలు నిర్ణయాలు

7

అక్షరాలు నేర్వాలంటే ఆరు కిలోమీటర్లు నడవాలి

- గిరిజన విద్యార్థుల కష్టాలు తీరేదెన్నడో?
- కొండతోగులో పాఠశాల ఏర్పాటుకు ఏళ్లుగా వినతి
- పట్టించుకోని పాలకులు, ఐటీడీఏ అధికారులు

7

అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా 'మహాలక్ష్మి'

- 18 నెలల కాలంలో రూ.6,700కోట్ల ఖర్చు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఖమ్మంలో '200కోట్ల మంది మహిళల ప్రయాణ' సంబురం
- రూ.30 చెల్లించి టికెట్ తీసుకుని ప్రయాణించిన తుమ్మల



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, జూలై 23 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమ పథకాల్లో భాగంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా మారిందని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. గడిచిన 18నెలల కాలంలో మహాలక్ష్మి పథకం కింద 200 కోట్ల మంది మహిళలు ప్రయాణించిన నేపథ్యంలో బుధవారం ఖమ్మం ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహించిన సంబురాల్లో ఆయన పాల్గొన్నారు. ఆర్టీసీ ఉచిత ప్రయాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.6700కోట్లు ఖర్చు చేసిందన్నారు. మహిళల ఆశీస్సులతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని వారి అభ్యున్నతికి ఎన్ని కోట్లు ఖర్చయినా భరించి అమలు చేస్తుందని, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తుందన్నారు. సోనియాగాంధీ ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ పథకం, 200యూనిట్లు ఉచిత విద్యుత్‌తో పాటు ఇందిరమ్మ ఇళ్లు, స్వయం సహాయక సంఘాలకు రుణాలు, అమ్మ క్యాంటీన్లు, మహిళ సూపర్ మార్కెట్లు తదితర వాటిని అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. దేశంలో ఎన్నికలు ఎక్కడ జరిగినా తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న మహాలక్ష్మి పథకం కావాలని ఆయా పార్టీలు, ప్రభుత్వాలను ప్రజలు అడుగుతున్నారని, పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఆగస్టు 15నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయనుందన్నారు. ఈ పథకం ద్వారా నిరుపేద, మధ్యతరగతి మహిళలకు ఆర్థిక స్వావలంబన ఏర్పడిందన్నారు. ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల్లో నడిపిస్తున్న ఘనత ఈ ప్రభుత్వానిదని, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను కూడా గాడిలో పెడుతున్నామన్నారు. ఖమ్మం జిల్లాలో మహాలక్ష్మి పథకం కింద రూ.331కోట్లు ఆర్టీసీకి చెల్లించగా.. మహిళలు ఉచిత ప్రయాణాలు సాగించారని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహార, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ శ్రీజ, ఆర్టీసీ ఆర్ఎం సరిరాం, కార్పొరేటర్ కమర్తపు మురళి, కన్నం వైష్ణవి పాల్గొన్నారు.

ఖమ్మం నుంచి బస్సులో ప్రయాణం..



మహాలక్ష్మి సంబరాల అనంతరం ఖమ్మం బస్టాండ్ నుంచి రఘునాథపాలెం మండలం మూలగూడెం గ్రామం వరకు మంత్రి తుమ్మల బస్సులో ప్రయాణించారు. గతంలో ఆ గ్రామానికి బస్సు నడిపిస్తానని ఇచ్చిన హామీ మేరకు బస్సు సర్వీసును ప్రారంభించిన అనంతరం ఆయన ఆ బస్సులోనే కండక్టర్‌కు రూ.30చెల్లించి టికెట్ తీసుకుని గ్రామస్థులతో పాటు గ్రామానికి వెళ్లారు.

కిన్నెరసానికి జలకళ


కిన్నెరసాని జలాశయం

పాల్వంచ రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : పాల్వంచ మండలంలోని కిన్నెరసాని జలాశయానికి భారీగా వరదనీరు చేరడంతో జలకళ సంతరించుకుంది. బుధవారం ప్రాజెక్టులో 402.40 అడుగులకు నీటి మట్టం చేరింది. ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు 10వేల క్యూసెక్కుల చొప్పున ప్రాజెక్టుకు నీరుచేరుతోంది. పాకాల కొత్తగూడం, గుండాల, ఇల్లెందు, టేకులపల్లి, కొత్తగూడెం అటవీ ప్రాంతాల నుంచి చిన్నవాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. జలాశయం సామర్థ్యం 407 అడుగులు కాగా ప్రస్తుతం 402.40 అడుగులకు నీరు చేరడంతో డ్యాం అధికారులు అప్రమత్తయ్యారు. దిగువ ప్రాంతంలోని గ్రామాల ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. విస్తారంగా వర్షాలు కురవడంతో పాటు కిన్నెరసాని జలాశయంకు నీటి మట్టం పెరుగుతుండటంతో ఏ సమయంలోనైన గేట్లు ఎత్తే అవకాశం ఉందని డ్యాం ఈఈ వెంకటేశ్వరరావు తెలిపారు. పరివాహక ప్రాంతంలోని రైతులు వ్యవసాయమోటార్లను ఒడ్డు ప్రాంతాలకు తెచ్చుకోవాలని కోరారు. వాగులు దాటొద్దని, మైకు ప్రచారం చేశారు.

'తాలిపేరు' పరవళ్లు

ప్రాజెక్టు 15 గేట్లు ఎత్తివేత
33 వేల క్యూసెక్కుల నీరు విడుదల


తాలిపేరు ప్రాజెక్టు

చర్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్‌గఢ్‌తో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు తాలిపేరు ప్రాజెక్టుకు భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు అప్రమత్తమై బుధవారం ప్రాజెక్టు 15 గేట్లు ఎత్తి 33వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. తుపాన్ కారణంగా ఛత్తీస్‌గఢ్‌లో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు బీజాపూర్, సుకుమా జిల్లాల్లోని వాగులు, చర్ల మండలంలోని రోటింత వాగు, జెర్రిపోతుల వాగు, తరివాగులు పొంగి పొర్లుతున్నాయి. ఆ వరద నీరు తాలిపేరులోకి వచ్చి చేరుతుండటంతో నీటిమట్టం గణనీయంగా పెరుగడంతో అధికారులు 15 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 74 మీటర్లు కాగా, ప్రస్తుతం 72.89 మీటర్లు ఉంది. అయితే రెండు రోజుల క్రితం వరకు నీరు లేక వెలవెలబోయిన తాలిపేరు ప్రాజెక్టు బుధవారం జలకళ సంతరించుకుంది.

మునిగిన 'నారచీరలు'



అలుగుపడిన గుబ్బలమంగి ప్రాజెక్టు


సీతమ్మవారి విగ్రహాన్ని చుట్టుముట్టిన వరద

దుమ్ముగూడెం జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం పర్ణశాల నారచీరల ప్రాంతాన్ని బుధవారం గోదావరి వరదనీరు చుట్టుముట్టడంతో సీతమ్మ వారి విగ్రహంతో పాటు పరిసర లోతట్టు ప్రాంత దుకాణాలు నీట మునిగాయి. ఛత్తీస్‌గడ్‌లో కురుస్తున్న వర్షాలకు గుబ్బలమంగి ప్రాజెక్టు నిండి అలుగు పారడంతో జలకళ సంతరించుకుంది. దీంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సున్నంబట్టి- బైరాగులపాడుల మధ్య లోలెవల్ కల్వర్టు వద్ద నడుము లోతున వరదనీరు చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సీతమ్మవాగు వరద నీటితో ఉధృతిగా ప్రవహిస్తోంది.

నిండుకుండలా వైరా రిజర్వాయర్

18.6 అడుగులకు చేరిన నీటిమట్టం


పూర్తిస్థాయిలో నిండిన వైరా రిజర్వాయర్

వైరా, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టాన్ని దాటి పొంగి ప్రవహిస్తుంది. గత రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో రిజర్వాయర్ పరివాహక ప్రాంతంలోని వాగులు, ఏర్లు నుంచి భారీగా వరదనీరు చేరడంతో రిజర్వాయర్ గరిష్ట నీటి మట్టం అయిన 18.3 అడుగులు మించి 18.6 అడుగులకు వరద నీరు చేరింది. దీంతో రిజర్వాయర్ అలుగు నుంచి వరదనీరు నదిలోకి ప్రవహిస్తుంది. ఈ ఏడాది దాదాపు పది రోజులు ముందుగా రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టాన్ని దాటింది. ఏటా జూలై చివర్లో కానీ, ఆగస్టులో కానీ కురిసిన వర్షాలకు రిజర్వాయర్ నిండేది. అయితే ఈ ఏడాది జూలై 15నే వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ నీటిని విడుదల చేశారు. వైరాలో బుధవారం 33.60 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

సంక్షేమ హాస్టళ్లలో నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

- ప్రత్యేక అధికారుల నియామకం
- ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి


కలెక్టర్ అనుదీప్

ఖమ్మం కలెక్టరేట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని సంక్షేమ హాస్టల్స్‌లో నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందేలా పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. వివిధ సంక్షేమశాఖల ఆధ్వర్యంలో 122 రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో సుమారు 13 వేల 876 మంది విద్యార్థినీ విద్యార్థులు ఉచిత విద్యతో పాటు వసతి పొందుతున్నారని తెలిపారు. ఇందులో బీసీ, గిరిజన, ఎస్సీ సంక్షేమ, మైనారిటీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం డైట్ చార్జీలను 40 శాతం, కాస్మెటిక్ చార్జీలను 200 శాతం పెంచినట్లు తెలిపారు. జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు పకడ్బందీ కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. రోజూ రెండు రకాల అల్పాహారాలు, సన్న బియ్యంతో వండిన అన్నంతో కలిపి ఏడు రకాల పదార్థాలు గుడ్డు, అందించనున్నారు. నెలకు ఆరుసార్లు మాంసాహారంతో విద్యార్థులకు సంపూర్ణ భోజనం అందించేలా ప్రభుత్వం మెనూ అమలు చేస్తుందన్నారు. జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లో ఫుడ్ పాయిజనింగ్ వంటి సంఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు పాటిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రత్యేక అధికారులు, వారి పరిధిలోని సంక్షేమ హాస్టళ్లలో ఆకస్మికంగా తనిఖీచేస్తూ, పాటిస్తున్న పారిశుధ్య చర్యలు, పిల్లలకు వండుతున్న ఆహార పదార్థాలు, కూరగాయల నాణ్యత, తాగునీటి సరఫరా, వంట ప్రదేశం పరిసరాలు, వంట గది పరిశుభ్రత, మెనూ అమలు వంటి పలు అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తూ అవసరమైన సూచనలు జారీ చేస్తారని తెలిపారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో చదివే పిల్లలకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. బయటి ఆహారాన్ని ఎట్టి పరిస్థితుల్లో రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లోకి అనుమతించడం లేదని, ప్రభుత్వం నిర్దేశించిన డైట్ మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టికాహారం విద్యార్థులకు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మున్నేరుకు 45 వేల క్యూసెక్కుల వరద..

- 8.6 అడుగులకు చేరిక
- లోతట్టు ప్రాంతాలను అప్రమత్తం చేస్తున్న అధికారులు




వరద ప్రవాహంతో మున్నేరు పెరుగుతున్న వరద ఉధృతిని తెలిపే నీటి మట్టం సూచిక

ఖమ్మం కలెక్టరేట్, జూలై 23 : మున్నేరుకు వరద ఉధృతి పెరుగుతోంది. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల్లో వరదనీరు మున్నేరుకు వస్తుంది. వరంగల్ జిల్లాలోని డోర్నకల్, బయ్యారం ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు వరదనీరంతా మున్నేరును ముంచెత్తుతోంది. ప్రస్తుతం 8.6 అడుగుల నీటిమట్టం ఉండగా ఈ రాత్రికి 12 అడుగులకు పెరగవచ్చని నీటిపారుదల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం మున్నేరుకు 40 వేల నుంచి 45 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తోందని అధకారులు తెలిపారు. దీంతో మున్నేరు పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం సాయంత్రం టెలికాన్ఫరెన్స్ ద్వారా అధికారులను అప్రమత్తం చేశారు. నగరంలోని బొక్కలగడ్డ, వెంకటేశ్వరనగర్ లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చే స్తున్నారు. వరద ఉధృతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ప్రవాహం పెరిగే క్రమంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించినట్లు తెలిసింది.

చెరువులకు జలకళ

ఖమ్మం కలెక్టరేట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గత వారం రోజులుగా కురిసిన వర్షాలకు చెరువులు నీటితో నిండి కళకళలాడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జలాశయాలు, చెరువులు కుంటలు నీటితో నిండిపోయాయి. పంటలకు అనుకూల సమయంలో జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లో వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జూలై నెలలో ఇప్పటి వరకు 272.0 మిల్లీ మీటర్ల వర్షం కురవాల్సి ఉండగా ఇప్పటి వరకు 189.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో జలవనరుల శాఖ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాలోని ఖమ్మం సర్కిల్ పరిధిలో 984 చెరువుల్లో 354 చెరువుల్లో 0-25శాతం నీటితో నిండాయి. 289 చెరువులు 25నుంచి 50శాతం నీళ్లు వచ్చాయి. 180 చెరువుల్లో 50 నుంచి 75శాతం నీళ్లు చేరాయి. 75 నుంచి 100శాతం నీటితో నిండిన చెరువులు 122 వరకు ఉన్నాయి. దాదాపు 39 చెరువులకు అధికంగా నీళ్లు వచ్చి చేరుతుండడంతో అలుగులు పారుతున్నాయి. ఖమ్మం, సత్తుపల్లి సర్కిళ్ల పరిధిలో చెరువులు దాదాపు వరదనీటితో నిండిపోయాయి.

ఖమ్మం సర్కిల్ పరిధిలో చెరువుల పరిస్థితి ఇలా..

జిల్లా	0-25%	25-50%	50-75%	75-100%	అలుగుపారుతున్నవి	మొత్తం
ఖమ్మం	354	289	180	122	39	984

మంగళవారం రాత్రి ముంచెత్తింది

ఖమ్మం జిల్లాలో 5.4 సగటు వర్షపాతం నమోదు


మత్తడి పోస్తున్న వైరా రిజర్వాయర్

ఖమ్మం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గడిచిన రెండు రోజులుగా ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలు పడుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం నుంచి మొదలైన వర్షం.. అర్ధరాత్రి వరకు దంచికొట్టింది. దీంతో మంగళవారం నుంచి బుధవారం ఉదయం ఎనిమిదిగంటల వరకు సగటున 5.44సెంమీ వర్షపాతం నమోదు కాగా.. అత్యధికంగా మధిరలో 11.3, ఎర్రుపాలెంలో 9.68, కూసుమంచిలో 8.28 సెంమీ నమోదైంది. ముదిగొండలో 6.94, ఖమ్మం రూరల్ మండలంలో 6.52, సింగరేణిలో 6.42, నేలకొండపల్లిలో 6.26, బోనకల్లులో 6.12, తల్లాడలో 5.94, కామేపల్లిలో 4.96, వేంసూరులో 4.68, చింతకాని 4.58, పెనుబల్లి 4.52, ఖమ్మం అర్బన్ పరిధిలో 3.86, వైరాలో 3.36,తిరుమలాయపాలెం 3.12, ఎన్కూరులో 2.86, సత్తుపల్లిలో 1.86 సెంమీ వర్షపాతం నమోదైంది. కాగా వరుసగా పడిన వర్షాలతో జిల్లాలోని చెరువులు జలకళను సంతరించుకున్నాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఖమ్మంలో మున్నేరు ప్రవాహం స్వల్పంగా పెరిగిన క్రమంలో కాల్వొడ్డు నుంచి నాయుడుపేట వైపు అధికారులు రాకపోకలు నిలిపివేశారు. కాగా బుధవారం ఉదయం నుంచి ఎన్కూరు మండలంలో 2.35 సెంమీ వర్షపాతం నమోదు కాగా మిగిలిన మండలాల్లో చిరుజల్లులతో కూడిన వర్షం పడింది. ఇదిలా ఉంటే వైరా రిజర్వాయర్ నిండుకుండను తలపిస్తోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టం 18.3అడుగులు దాటి 18.6అడుగులకు చేరింది. దీంతో అలుగుల నుంచి వరదనీరు దిగువకు ప్రవహిస్తోంది.

సర్కారీ చదువులు.. చతికిల!

(5వ పేజీ తరువాయి)

అడ్మిషన్లు తీసుకుని.. కోచింగ్‌ల కోసం ప్రైవేటులో చదువుతున్నారు. దీనివల్ల ఇంజనీరింగ్‌లో పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్ వస్తుందని భావించి ప్రభుత్వ కాలేజీల్లో అడ్మిషన్లు తీసుకుని ప్రైవేటులో విద్యాబోధన సాగిస్తున్నారు. ప్రభుత్వ బడుల్లో ప్రమాణాలు పడిపోవడానికి.. విద్యార్థుల సంఖ్య తగ్గడానికి ఉపాధ్యాయుల తీరు కూడా కారణమన్న విమర్శలున్నాయి. ఉపాధ్యాయులు సమయం పాటించకపోవడం, చాలామంది ఇతర వ్యాపారాల్లో నిమగ్నం కావడం విద్యావ్యవస్థపై ప్రభావం చూపుతోంది. ఈ పరిస్థితులపై ఉన్నత విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారాణా సమీక్షించాలని, ప్రభుత్వం ద్వారా ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

ఇంకా పలు కాలేజీలు, పాఠశాలల్లో అసౌకర్యాలే

జిల్లాలో పలు కాలేజీలు, పాఠశాలలు అసౌకర్యాల మధ్యనే ఉన్నాయి. ఒకేస్కూల్‌లో కొన్ని భవనాలు కొత్తవి ఉంటే కొన్నిపాతవి కొనసాగుతున్నాయి. వర్షం వస్తే పాఠశాల, కాలేజీల ప్రాంగణాలు బురదమయంగా మారుతున్నాయి. గత ప్రభుత్వ మన ఊరు మన బడి కింద జిల్లాలో పనులకు సుమారు రూ.10కోట్లు ఇంకా చెల్లించాల్సి ఉంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో అమ్మ ఆదర్శకమిటీల పేరుతో పాఠశాలల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇప్పటికి రూ.35కోట్లు పనులుజరగ్గా రూ.23కోట్లవరకు మంజూరయ్యాయి.

ఖమ్మానికి యూనివర్సిటీ కలేనా

జిల్లా కేంద్రం ఖమ్మంలో జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఎప్పటినుంచో ఉంది. అన్ని ఉమ్మడి జిల్లాల కేంద్రాల్లో యూనివర్శిటీలుండగా.. ఏపీ, తెలంగాణకు సరిహద్దున ఉన్న ఖమ్మంలో జనరల్ యూనివర్సిటీ ఏర్పాటుచేయాలని విద్యార్థి సంఘాలు ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నాయి. ప్రస్తుతం కాకతీయ యూనివర్సిటీ పరిధిలోనే ఖమ్మం జిల్లా విద్యావ్యవస్థ నడుస్తోంది. ఇక్కడ యూనివర్సిటీ ఏర్పాటైతే ఉమ్మడి ఖమ్మంతో పాటు పొరుగున ఉన్న సూర్యాపేట, మహబూబాబాద్, ఏపీలోని పలు జిల్లాల వారికి ఉన్నత విద్య అందుబాటులోకి రానుంది.

ఎర్త్‌సైన్స్ వర్సిటీని ప్రపంచ స్థాయిలో తీర్చిదిద్దాలి


విద్యాశాఖకు చెందిన రాష్ట్ర ఉన్నతాధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

(5వ పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారని, ఎమ్మెల్యేల సహకారంతో ప్రభుత్వం మద్దతు తీసుకురాగలిగామని తెలిపారు. అత్యున్నత స్థాయికి ఈ విశ్వవిద్యాలయం ఎదగాలంటే వైస్ చాన్స్‌లర్ డాక్టర్ యోగితారాణా లాంటి అనుభవజ్ఞులైన అధికారుల పర్యవేక్షణ ఎంతో కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజక్టు కోసం కేటాయించిన 300 ఎకరాల భూమిలో, మూడు సంవత్సరాల్లో శాశ్వత భవనాలు, అవసరమైన వసతులతో కూడిన యూనివర్సిటీగా అభివృద్ధి చేయనున్నట్టు వెల్లడించారు. ముఖ్యమంత్రితో చర్చించిన అనంతరం నిధులను కేటాయిస్తామని పేర్కొన్నారు.

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ జిల్లాలో డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ ప్రారంభించడం జిల్లా అభివృద్ధికి శుభ పరిణామమన్నారు. ఈ విశ్వ విద్యాలయం దేశంలోని విద్యార్థులకు తమ విద్యా ప్రమాణాలు పెంచుకోవడానికి, మెరుగైన ఉద్యోగ అవకాశాలు సాధించటానికి ఎంతగానో తోడ్పడుతుందన్నారు.

విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు ప్రారంభమవుతాయని, రాబోయే మూడేళ్లలో అన్ని కోర్సులను ప్రవేశపెడతామన్నారు. విద్యార్థులు భూమిపై అవగాహన, భూమికి సంబంధించి అన్ని పరిశోధనలకు సంబంధించిన కోర్సులను నేర్చుకోవడం ద్వారా ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉంటాయన్నారు. ఎర్త్‌సైన్స్ యూనివర్శిటీలో విద్యార్థులకు సౌకర్యాలు, వివిధ రకాల కోర్సులు తదితర సదుపాయాల కల్పనకు వివిధ దేశాల విశ్వ విద్యాలయాల సమన్వయంతో రూపొందిస్తామని, దీనికి గాను మూడు కమిటీలను ఏర్పాటు చేశామన్నారు.

సాంకేతిక విద్యా కమిషనర్ దేవసేన మాట్లాడుతూ గొప్ప వ్యక్తి డాక్టర్ మన్మోహన్‌సింగ్ పేరిట ఏర్పాటైన ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీని ప్రారంభించడం రాష్ట్రానికే గర్వకారణమన్నారు. రాముడు కాలు మోపిన ఈ భూమిలో ఈ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం, దేశంలోనే వివిధ రంగాల్లో నిపుణులను కమిటీల్లో సభ్యులుగా చేయడం ద్వారా అంతర్జాతీయ ప్రమాణాలతో పూర్తిస్థాయి యూనివర్సిటీగా రూపుదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాకతీయ, బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీల వీసీలు ప్రతాప్‌రెడ్డి, ఘంటా చక్రపాణి, భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి పాటిల్, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి, ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్, మన్మోహన్‌సింగ్ ఎర్త్‌సైన్స్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రాంచంద్రన్, రూసా ప్రతినిధి సౌందర్య జోసఫ్, విద్యాశాఖలోని ఇతర అధికారులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ భూములకు రక్షణ కల్పించండి

అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశాలు



కొత్తగూడెం ఎడ్యుకేషన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీకి సంబంధించిన భూములకు రక్షణ కల్పించాలని, అవి అన్యాక్రాంతం కాకుండా ప్రహరీ నిర్మాణంపై దృష్టి పెట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. బుధవారం యూనివర్సిటీ ప్రాంగణంలో ఆయన అధికారులతో చర్చించారు. యూనివర్సిటీకి ప్రస్తుతం 309.75ఎకరాల భూమి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారని, అవి కబ్జాలు కాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల సూచించారు. సమావేశంలో వీసీ డాక్టర్ యోగితారాణా, కమిషనర్ దేవసేనా కాకతీయ యూనివర్సిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇల్లెందు క్రాస్ రోడ్ లోని టూరిజం హోటల్‌ను పరిశీలించారు. హోటల్ నిర్మాణ పనులను త్వరితగతి న పూర్తి చేయాలని, ఆగస్టులో సీఎం చేతుల మీదుగా ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ, టూరిజం హోటల్‌ను ప్రారంభించే విధంగా అన్ని పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఉల్లాస భరితం... వెన్నెల జలపాతం


పరవళ్లుతొక్కుతున్న వెన్నెల జలపాతం

మణుగూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : చుట్టూ దట్టమైన అడవి.. గుట్టపై నుంచి తెల్లని పాలవంటి జలధార ఉవ్వెత్తున ఎగసి పడుతూ.. నేలకు తాకే సుమనోహర దృశ్యం.. ఒక్క సారిగా ఈ దృశ్యం కళ్లముందు కనబడితే ఆ కనులకు మనసుకు కలిగే ఆనందం వర్ణనాతీతం.. ప్రకృతి ఒడి నుండి సహజ సిద్ధంగా మణుగూరులోని రథం గుట్టల మధ్య నుంచి పారే ఈ జలపాతమే వెన్నెల జలపాతం.. వర్షాలు జోరుగా కురిశాయంటే చాలు అందరి దృష్టి ఈ జలపాతం వైపుకే మరలుతొంది. మణుగూరు పట్టణ పరిసర ప్రాంతాల నుంచే కాకుండా అశ్వాపురం, పినపాక, కరకగూడెం, భద్రాచలం, కొత్తగూడెం ప్రాంతాల నుంచి కూడా ఇక్కడికి ఈ జలపాతాన్ని చూసి అందులో కాసేపు సేద తీరేందుకు పర్యాటకులు ఉత్సాహాన్ని చూపుతారు. చిన్నా పెద్ద ఇలా ఇంటిల్లిపాది ఇక్కడికి చేరుకుని పచ్చని అటవి ప్రాంతంలో జల ఝురుల సవ్వడిని వింటూ హాయిగా పరవశించి పోతుంటారు. దాదాపు వంద అడుగుల ఎత్తు నుంచి జాలువారే జలపాతం కింద స్నానాలు చేసి కాసేపు సందడిగా సమయాన్ని గడిపి వెలుతున్నారు. గత రెండు రోజులుగా కురిసిన భారీవర్షానికి కనువిందు చేస్తూ ఉప్పెనలా వెన్నెల జల పాతం తన అందచందాలను ఇలా పర్యాటకులకు దర్శనమిస్తొంది. గతంలో ఇక్కడికి చేరుకోవాలంటే రాళ్లు రప్పల మధ్య నడుచుకుంటూ దాదాపు రెండు కిలోమీటర్ల దూరం వెల్లాల్సి వచ్చేది. కానీ నడిచేందుకు వీలు గా ఫారెస్టు శాఖ అధికారులు అర్బన్ పార్కుగా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దారు. చక్కని రోడ్డు సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. దీంతో పర్యాటకుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది.

కాంగ్రెస్‌లోకి కొండబాల?

(5వ పేజీ తరువాయి)

సత్సంబంధాలున్నాయి. ఈఇద్దరూ కూడా వైరా మండలానికి చెందిన వారే. వైరా మండలంలోని కొండకొడిమ గ్రామానికి చెందిన కొండబాల ఐదున్నర దశాబ్దాలుగా రాజకీయాల్లో కొనసాగుతున్నారు. విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్ రాజకీయాల్లో చురుగ్గా వ్యవహరించిన ఆయన డిగ్రీ చదువుతున్న సమయంలోనే కొండకొడిమ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1995వరకు సర్పంచ్ పదవిలో కొనసాగిన ఆయన మధిర తాలూకా మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షుడిగా, ఎల్ఎంటీ డైరెక్టర్‌గా పనిచేశారు. 1981లో మధిర సమితికి పోటీచేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కూడా పనిచేసిన కొండబాల 1985 జనవరిలో కాంగ్రెస్‌ను వీడి తెలుగుదేశంలో చేరారు. టీడీపీ నుంచి డీసీసీబీ చైర్మన్‌గా, భద్రాచలం ట్రస్టు బోర్డు చైర్మన్‌గా, మధిర ఎమ్మెల్యేగా పనిచేశారు. అతర్వాత ఉమ్మడి ఖమ్మంజిల్లా టీడీపీ అధ్యక్షుడిగా పనిచేశారు. 2014లో రాష్ట్ర ఆవిర్భావం తర్వాత టీడీపీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. 2016 నుంచి 2023వరకు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పనిచేశారు. అలాగే మధిర నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్‌గా, బీఆర్ఎస్ ఇన్‌చార్జ్‌గా కొన్ని సంవత్సరాలు పనిచేశారు. ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఆయన కాంగ్రెస్‌లో చేరేందుకు అటు భట్టి విక్రమార్కతో హైదరాబాద్‌లో భేటీ అయ్యారని, ఇటు మధిర, వైరా నియోజకవర్గాల్లోని తన అనుచరులతో ఖమ్మంలోని తన నివాసంలో మంతనాలు సాగిస్తున్నారని తెలుస్తోంది. ఈ క్రమంలో తాను బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడమే తరువాయని కొండబాల ఇప్పటికే తన అనుచరులకు స్పష్టం చేశారని సమాచారం. అయితే కొందరు నాయకులు తాము టీడీపీ, బీఆర్ఎస్‌లో ఉన్నప్పటి నుంచి కాంగ్రెస్ తోనే పోరాడామని అలాంటి పార్టీలో చేరితే తామెలా పనిచేయాలని అభిప్రాయపడినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌లో చేరికకు చింతకాని, బోనకల్, ముదిగొండ మండలాలకు చెందిన కొందరు ముఖ్యనాయకులతో పాటు నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు సిద్ధమయ్యారని సమాచారం. ఇక మధిర నియోజకవర్గంలోని ఆయనకు ముఖ్య అనుచరుడిగా ఉన్న మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ సహా పలువురు ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరారు.

నాణ్యమైన విద్యను అందించాలి

మెనూ ప్రకారం భోజనం అందించాలి
సమగ్ర శిక్ష అభియాన్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ వెంకటనర్సమ్మ


జూలూరుపాడు కేజీబీవీలో బాలికల సామర్థ్యాలను పరిశీలిస్తున్న సమగ్రశిక్ష అభియాన్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ వెంకటనర్సమ్మ

జూలూరుపాడు, జూలై 23(ఆంధ్రజ్యోతి): కేజీబీవీలలోని బాలికలకు నాణ్యమైన విద్యను అందించాలని, వారి విద్యా సామర్థ్యాలను పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు కృషిచేయాలని సమగ్ర శిక్ష అభియాన్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ వెంకటనర్సమ్మ ఉపాధ్యాయ సిబ్బందికి సూచించారు. బుధవారం జూలూరుపాడులోని కేజీబీవీని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. స్టోర్‌రూం, భోజన పదార్థాలను, వంట గది, మరుగుదొడ్లను ఆమె పరిశీలించారు. డిజిటల్ తరగతులను పరిశీలించి బోధన తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. 8వ తరగతి బాలికలలో గణిత సామర్థ్యాలను పరిశీలించారు. కొంతమంది బాలికలు వెనకబడి ఉండటంతో వారిలో సామర్థ్యాలను పెంపొందించాలని గణిత ఉపాధ్యాయురాలును ఆదేశించారు. మెనూ ప్రకారం భోజన పదార్థాలు అందుతున్నాయా అని బాలికలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజన పదార్థాలను అందించాలని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని బాలికలు కష్టపడి చదివి ఉద్యోగాలను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్టేట్ కోఆర్డినేటర్ శిరీష, ఎంఈఓ బి.జుంకీలాల్, పాఠశాల ప్రత్యేకాధికారి పద్మజ తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా కేఎంసీ కౌన్సిల్ సమావేశం

- పలు అంశాలపై విస్తృత చర్చ
- ఒక్కో పనికి 11సార్లు టెండర్లా?
- వాగ్వాదానికి దిగిన బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్లు
- సముదాయించిన మేయర్, కమిషనర్
- ఉద్యోగులకు వరాల జల్లు



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ నీరజ, పక్కన కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం కార్పొరేషన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పలు అంశాలపై చర్చించడంతో పాటు పలు అభివృద్ధి పనులకు నిధుల ఆమోదానికి బుధవారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గ సమావేశం వాడీవేడిగా సాగింది. గంటపాటు జరిగిన ఈ సమావేశంలో ప్రధాన సమస్యలపై చర్చించే క్రమంలో అధికార, ప్రతి పక్ష సభ్యులు వాగ్వాదానికి దిగారు. దీంతో మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య జోక్యం చేసుకొని కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్పొరేటర్లను సముదాయించారు. కాగా మరో ఏడాదిలో పాలకవర్గం ముగుస్తుండటంతో క్షేత్రస్థాయిలోని ఉద్యోగులకు వరాల జల్లు కురిపిస్తూ పలు ఆమోదాలు తెలిపారు.



హాజరైన కార్పొరేటర్లు

ఇందిరమ్మ ఇళ్లు, ప్లాస్టిక్, స్వచ్ఛత అవార్డులపై..

మేయర్ పునుకొల్లు నీరజ అధ్యక్షతన జరిగిన ఈ కౌన్సిల్ సమా వేశంలో ప్రతిపాదనలను ఇరు పక్షాలు, వామపక్ష పార్టీల కార్పొరేటర్లు ఆమోదించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, ప్లాస్టిక్ నియంత్రణ చర్యలు, ఖమ్మం నగరానికి వచ్చిన అవార్డులపై ప్రశ్నించారు.ఇందిరమ్మ ఇళ్ల కమిటీల్లో డివిజన్లలో కార్పొరేటర్లను చైర్మన్‌గా నియమించారని, కానీ సభలు పెట్టకుండా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని ప్రశ్నించారు. అందుకు స్పందించిన కాంగ్రెస్ కార్పొరేటర్లు బీఆర్ఎస్ ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఎలా మంజూరు చేశారని ప్రతిదాడి చేశారు.ఆ నాడు ఇళ్లు మంజూరు చేసిన వాటిలో మీరు కూడా ఉన్నారు కదా అని బీఆర్ఎస్ కార్పొరేటర్లు, కాంగ్రెస్‌లో చేరిన మాజీ బీఆర్ఎస్ కార్పొరేటర్లతో అనటంతో చర్చ తీవ్ర స్థాయిలోకి వెళ్లింది. ప్లాస్టిక్ నియంత్రణలో గత ప్రభుత్వంలో ఖమ్మం నగరానికి 6వ స్థానం రాగా.. ఇప్పుడు 60వ స్థానానికి చేరిందన్నారు. మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి ప్లాస్టిక్ కవర్లు అమ్మకాలు జరిపే వారిపై కఠినంగా జరిమానాలు, కేసులు నమోదు చేయాలని అందుకు తాను కూడా వస్తానని పేర్కొన్నారు. దీంతో స్పందించిన కార్పొరేటర్ కమర్తపు మురళీ ఖమ్మంలో ప్లాస్టిక్ కవర్లు అమ్మకాలు జరిపే వ్యాపారులపై చర్యలు తీసుకుంటే ప్రయోజనం లేదని, కేంద్ర ప్రభుత్వం నుంచే చట్టం తేవాలని చెప్పటంతో చర్చ వాగ్వాదానికి దారి తీసింది. అవార్డులు రాకపోవటానికి గల కారణాన్ని కమిషనర్ అభిషేక్ అగస్త్య వివరించారు.

ఒక్కో పనికి 11సార్లు టెండర్లు

ఖమ్మం నగరంలో ఒక్క రహదారి నిర్మాణం చేయాలంటే 11 సార్లు టెండర్లు పిలిచే పరిస్థితి ఎందుకు వచ్చిందని కార్పొరేటర్లు ఇంజనీరింగ్ అధికారులను నిలదీశారు. గతంలో ఒకటి లేదా రెండు సార్లు మాత్రమే టెండర్లు పిలిచేవారని ఇటువంటి పరిస్థితి ఇప్పుడేందుకు వచ్చిందని ప్రశ్నించారు. ఇళ్లు ఉండేచోట రహదారులు ఎందుకు వేయటం లేదని ప్రశ్నించారు. దీంతో స్పందించిన ఈఈ కృష్ణలాల్ మాట్లాడుతూ 8 పనులకు 12 సార్లు, 4పనులకు 4 సార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావటం లేదన్నారు. దీంతో స్పందించిన కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ ఇప్పటికే తాను రెండు సార్లు కాంట్రాక్టర్లతో సమావేశాలు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు.

ఉద్యోగులకు వరాల జల్లు

ఏడాది లోపుగా ఖమ్మం నగర పాలక సంస్థ పాలకవర్గం పదవీ కాలం ముగుస్తుండటంతో ఉద్యోగులకు వరాల జల్లును కురిపించేందుకు, కేఎంసీపై ఆర్థిక భారం మోపేందుకు కౌన్సిల్ సమావేశంలో నిర్ణయాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఒక వైపు స్వచ్ఛతా అవార్డులు రాలేదని కార్పొరేటర్లు గొడవలు చేస్తుంటే ఎన్విరాన్‌మెంట్ అధికారికి ఏకంగా వేతనాలు పెంచారు. పారిశుధ్యం బాగోలేదని, వార్డు ఆఫీసర్లు పర్యవేక్షణ చేయాలని, కార్పొరేటర్లు గగ్గోలు పెడితే ఆరోపణలు ఎదుర్కొంటున్న జవాన్లకు నెలకు 60 లీటర్ల పెట్రోల్ సౌకర్యంపై తీర్మానించారు. పదేళ్లుగా వాటర్ వర్క్ చేస్తున్న మరో 12మంది కార్మికులను అవుట్ సోర్సింగ్‌లోకి తీసుకోవాలని సీడీఎంఏకు పంపాలని నిర్ణయించారు. వీటితో పాటుగా మరికొంత మంది సిబ్బంది వేతనాలు పెంచినట్లు సమాచారం.



మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న మహబూబ్ నగర్ జిల్లా విద్యార్థులు

విద్యార్థుల ఉన్నతికి నవోదయ బాటలు

- పాలేరు జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు
- అట్టహాసంగా రాష్ట్రస్థాయి క్లస్టర్ మీట్ ప్రారంభం
- హాజరైన పది జిల్లాల విద్యార్థులు



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

కూసుమంచి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): చదువుతోపాటు ఆటలకు అత్యంత ప్రాధాన్యమిస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి నవోదయ విద్యాలయాలు బాటలు వేస్తున్నాయని పాలేరు నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. అలాంటి విద్యాలయాల్లో సీటు సాధించిన విద్యార్థులు ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. బుధవారం కూసుమంచి మండలం పాలేరు జవహర్ నవోదయ విద్యాలయంలో రాష్ట్రస్థాయి క్లస్టర్‌స్థాయి ఆటలపోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ప్రిన్సిపాల్ క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, విద్యార్థుల్లో మానసిక ఉల్లాసానికి, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు క్రీడలు దోహదపడుతాయని అన్నారు. ప్రతి విద్యార్థి ఉత్తమపౌరులుగా తయారుకావాలని, తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలని, సమాజానికి ఏదో ఒక విధంగా సేవ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ సాంబశివరావు, పీఈటీ కృష్ణ పాల్గొన్నారు. కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, మెదక్, నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జిల్లాలతో పాటు ఆతిథ్య ఖమ్మం జిల్లా పాలేరు నవోదయ విద్యాలయాలకు చెందిన సుమారు 350మంది హాజరయ్యారు. మూడు విభాగాల్లో పోటీలు జరుగనున్నాయి. కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చదరంగం, యోగా పోటీలు జరుగుతుండగా, ఆయా క్రీడల్లో ప్రతిభ కనబర్చిన వారిని రీజనల్‌మీట్‌కు ఎంపిక చేయనున్నారు. గురువారంతో క్రీడలు ముగుస్తాయి.

అక్షరాలు నేర్వాలంటే..

ఆరు కిలోమీటర్లు నడవాల్సిందే..

కొండతోగు గిరిజన విద్యార్థుల కష్టాలు తీరేదెన్నడో?

వాగులు.. వంకలు దాటి పొలాల గట్ల మీద నడుస్తూ డొంకలను దాటితేనే వారికి నాలుగు అక్షరాలు వచ్చేది. అక్షరాలు నేర్వాలంటే ఆ గిరిపుత్రులు పడే కష్టాలు వర్ణనాతీతం. ఏళ్లుగా వారు పడుతున్న ఇబ్బందులు అటు అధికార యంత్రాంగానికి.. ఇటు ఐటీడీఏకు ఏమాత్రం పట్టడం లేదు. అయ్యా మా పల్లెలో పాఠశాల ఏర్పాటు చేయండంటూ గిరిజనులు వేడుకుంటున్నా.. విద్యాశాఖ అధికారులు మాత్రం పట్టించుకోవటం లేదు. అయ్యా.. మాకు బడి అంటే చూద్దాంలే అనేవారే తప్ప పట్టించుకునేవారే లేరంటూ చిన్నారుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారి కష్టాలపై ప్రత్యేక కథనం...



బడికి వెళ్లేందుకు వాగు దాడుతున్న విద్యార్థులు

అశ్వారావుపేట రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట మండలంలోని మారుమూల గిరిజన గ్రామం కొండతోగు. ఇక్కడ 50 కుటుంబాలు, దాదాపు 200మంది వరకు జనాభా ఉన్నారు. ఈ గ్రామంలో ఒకటి నుంచి ఐదువరకు విద్యనభ్యసించే విద్యార్థులు 20 మందికిపైగానే ఉన్నారు. కానీ ఇక్కడ సర్కారు బడి లేదు. ఇక్కడి విద్యార్థులు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న పండువారిగూడెం పాఠశాలకు వెళ్లి చదువుకుంటున్నారు. ఎండైనా.. వానైనా.. చిన్నారులు నిత్యం రాను పోను ఆరు కిలోమీటర్లు నడవాల్సిందే. కొండతోగు నుంచి పండువారిగూడెం గ్రామానికి వెళ్లాలంటే రెండు మార్గాల్లో వెళ్లవచ్చు. ఒకటి కాలినడకన.. మరోటి మల్లాయిగూడెం, నాగులగుంపు మీదుగా 10 కిలోమీటర్లు ప్రయాణించాలి. వర్షాలు వచ్చి వాగులు పొంగితే చిన్నారులు ఇంటి వద్దే ఉండాలి.

ఎవరిని వేడుకున్నా ఫలితం శూన్యమే

కోట్ల రూపాయలు వెచ్చించి గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించే పాలకులకు ప్రతీ గ్రామంలో పాఠశాల ఏర్పాటుపై పట్టింపేలేదు. తమ గ్రామంలో పాఠశాలను ఏర్పాటు చేయాలని గ్రామస్థులు వేడుకోని అధికారి గాని, ప్రజాప్రతినిధి గాని లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలున్నా లేకున్నా ఎక్కడ పడితే అక్కడ పాఠశాలను ఏర్పాటు చేసే ఐటీడీఏ అధకారులు కూడా ఈ గ్రామంలో బడి ఏర్పాటుపై దృష్టి పెట్టడం లేదు.

పట్టుతప్పిన పట్టణ పారిశుధ్యం

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉమ్మడి జిల్లా వెనుకబాటు

7 నుంచి 60వర్యాంకుకు దిగజారిన ఖమ్మం

ఖమ్మం కార్పొరేషన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): పట్టణ పారిశుధ్య నిర్వహణ పట్టుతప్పిందని స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులతో తేటతెల్లమవుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఖమ్మం నగర పాలక సంస్థ ర్యాంకు దిగజారిపోయింది. సత్తుపల్లి, మధిర, వైరా మున్సిపాలిటీలు కొంత మెరుగ్గా ఉన్నాయి. భద్రాద్రి జిల్లా మున్సిపాలిటీలు పర్వాలేదనిపించాయి. ఖమ్మం నగర పాలక సంస్థ, ఇల్లెందు మున్సిపాలిటీలు మినహా మిగిలిన మున్సిపాలిటీలు 2023 కంటే 2024లో ఎక్కువ మార్కులను సాధించినా అవార్డు రేస్‌లోకి రాలేక పోయాయి. గతేడాది ఖమ్మం నగర పాలక సంస్థ రాష్ట్రంలో 7వ స్థానం రాగా ఇప్పుడు 60కు చేరింది. జాతీయ స్థాయిలో గతేడాది 141వ స్థానం రాగా ఇప్పుడు 373కు చేరింది. ఉమ్మడి జిల్లాలో ఒక్క మున్సిపాలిటీకి కనీస గుర్తింపు రాలేదు.

మున్సిపాలిటీ	ర్యాంకు	మార్కులు
పాల్వంచ	49	7,483
కొత్తగూడెం	65	7,015
ఇల్లెందు	93	6,143
ఖమ్మం	60	7,151
సత్తుపల్లి	95	6,099
మధిర	113	5,550
వైరా	129	4,763

గంజాయి ఉచ్చులో మైనర్లు!

(5వ పేజీ తరువాయి)

గుర్తించగా.. వీరిలో మైనర్లు కూడా ఉన్నారని సమాచారం. వీరందరికీ అప్పట్లో కౌన్సెలింగ్ ఇచ్చి పంపగా.. వారి ఇటీవల సమన్లు జారీ అయ్యాయని తెలిసింది. అప్పటి సంఘటన ఇప్పటికీ ప్రధాన చర్చగానే ఉంది.

సర్వత్రా ఆందోళన....

గంజాయి విక్రయం, గంజాయి తాగడం లాంటి సంఘటనలు ఇటీవల కాలంలో తగ్గినట్టు అనిపించినా.. రెండు రోజులుగా జరుగుతున్న పరిణామాలతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. సత్తుపల్లి ప్రాంతంలో గంజాయి మహమ్మారి తీవ్ర కలకలం సృష్టిస్తోంది. గతంలో పట్టణంలో కొందరు ప్రముఖుల పిల్లలకు గంజాయి కేసుకు సంబంధించి కౌన్సెలింగ్ ఇచ్చిన విషయాన్ని మరువకముందే.. మరోసారి గంజాయి విక్రేతలను పోలీసులు అదుపులోకి తీసుకోవటంతో తల్లిదండ్రులు మరింత ఆందోళన చెందుతున్నారు. యుక్త వయస్సులో ఉన్న తమ పిల్లలను మత్తుబారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దృష్టిపెడుతున్నారు. పోలీసులు కూడా అప్రమత్తంగా ఉండాలని వారికి సూచిస్తున్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

ఇల్లెందురూరల్, జూలై23(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఏపెలగడ్డతండాలో జరిగింది. గ్రామస్థులు, కుటుంబసభ్యుల కథనం మేరకు ఏపెలగడ్డతండాకు చెందిన ధరావత్ రమేష్(33) బుధవారం ఉదయం గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకోని అనుమానాస్పదంగా మృతి చెందాడు. 11ఏళ్ల క్రితం 9వమైలు తండాకు చెందిన ఊర్మిలతో వివాహం జరగగా వారికి కుమా ర్తె, కుమారుడు ఉన్నారు. ఇరువురి మధ్య కొంతకాలంగా మనస్పర్ధలు ఏర్పడంతో భార్య పుట్టింటిలోనే ఉంటుంది. ఇటీవల పెద్దమనుషులు భార్యభర్తల మధ్య రాజీ చేసి కాపురానికి పంపారు. ఈక్రమంలో రెండు రోజుల క్రితం వారి మధ్య గోడవలు జరిగాయని గ్రామస్థులు తెలుపుతున్నారు. మృతి చెందిన రమేష్ ఒంటిపై రక్తపు మరకలు, గాయాలు ఉన్నాయని గ్రామస్థులు తెలుపుతున్నారు. రమేష్ మృతిపై అనుమానాలు ఉన్నాయని బంధువులు, గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈతకు వెళ్లి యువకుడు...

బూర్గంపాడు, జూలై 23(ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు సీతారామప్రాజెక్టు కాలువలో పడి మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం పాతపినపాక వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పినపాకపట్టీనగర్ గ్రామానికి చెం దిన బొర్రా శివ(16)అనే యువకుడు మరో ఇరువురు స్నేహితులతో కలిసి బుధవారం సాయంత్రం పాత పినపాక సమీపంలోని సీతారామ ప్రాజెక్టు కాలువలో ఈతకు వెళ్లారు. వీరిలో శివ, నందు అనే ఇరువురు కాలువలో ఈతకు దిగగా శివ గల్లంతయ్యాడు. గమనించిన స్నేహితులు కాపాడేందుకు ప్రయత్నించిన ఫలితం లేకపోవడంతో, బంధువులకు సమాచారం అందించారు. బాధిత కుటుంబసభ్యులు, గ్రామస్థులు కాలువలో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. మృతుడు గత ఏడాది పదో తరగతి పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటున్నట్లు తెలుస్తోంది. పోలీసులు ప్రమాదంపై ఆరా తీస్తున్నారు. బాధిత కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి.

రైలు నుంచి జారిపడి వ్యక్తి..

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 23(ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం ఖమ్మం నగరంలోని ధంసలాపురం ప్రాంతంలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకారం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన తామడ రాంబా బు(25) అదే ప్రాంతానికి చెందిన ఓ వృద్ధుడిని రైళ్లో హైదరాబాద్ ఆసుపత్రికి తీసుకెళ్లే క్రమంలో ఖమ్మం నగరంలోని ధంసలాపురం వద్ద రైలు నుంచి ప్రమా దవశాత్తూ జారిపడి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రైల్వే పోలీసులు భీమవరంలోని మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని అన్నం శ్రీనివాసరావు సహకారంతో నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు.

చికిత్స పొందుతూ వ్యక్తి....

టేకులపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు కథనం ప్రకారం మంగళవారం మండలంలోని పాతలచ్చగూడెం గ్రామానికి చెందిన కొమరం హనుమంతు(58)తో పాటు అదే గ్రామానికి చెందిన ఆటోలో మరి కొంతమందితో కలిసి పాతలచ్చగూడెం నుంచి టేకులపల్లికి వెళుతుండగా దంతెలతండా సమీపంలో బొలెరోట్రాలీ ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న హనుమంతుతో పాటు వేప శ్రీలతకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని వెంటనే కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హనుమంతును ఖమ్మంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుని కుమారుడు వీరభద్రం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ రాజేదంర్ తెలిపారు.

బ్యాటరీల చోరీ

దుమ్ముగూడెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తూరుబాక వంతెన వద్ద నిర్మాణ పనుల్లో ఉన్న యంత్రాల బ్యాటరీలు మంగళవారం రాత్రి చోరీకి గురయ్యాయి. ఎక్స్‌కవేటర్‌కు చెందిన రెండు బ్యాటరీలు, జనరేటర్‌కు ఉన్న ఒక బ్యాటరీను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. వీటి విలువ రూ.33 వేల వరకు ఉంటుందని కాంట్రాక్టరు తెలిపారు. కాంట్రాక్టర్ ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

తల్లి ప్రాణాలకు తన ప్రాణం అడ్డువేసిన కుమారుడు

- ఇంటి స్థల వివాదంలో తల్లిని కొట్టబోయిన అవతలి వర్గం వారు
- అడ్డురావడంతో యువకుడి తలకు తీవ్ర గాయం
- చికిత్స పొందుతూ మృతి.. అన్నారుగూడెంలో విషాదం



లక్ష్మీనారాయణ(ఫైల్)

తల్లాడ, జూలై23(ఆంధ్రజ్యోతి): కన్న తల్లిపై జరుగుతున్న దాడిని అడ్డుకోబోయి కుమారుడు హత్యకు గురయ్యాడు. ఈసంఘటన ఖమ్మంజిల్లా తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలో జరిగింది. హత్యాయత్నంలో తీవ్రంగా గాయపడి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అన్నారుగూడెం గ్రామానికి చెందిన శెట్టి లక్ష్మీనారాయణ(38) మంగళవారం అర్ధరాత్రి కన్నుమూశాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఈనెల 19న మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో అన్నారుగూడెం గ్రామంలో ఇంటి స్థలం విషయంలో బట్టు మంగమ్మపై అదే గ్రామానికి చెందిన సుంకర శివ అతని తల్లి సుంకర అరుణ కలిసి గొడవపడ్డారు. ఈసమయంలో అక్కడే ఉన్న శెట్టి కమలమ్మను కూడా శివ, అరుణ కలిసి దుర్భాషలాడారు. ఎందుకమ్మా మమ్మల్ని తిడుతున్నారని, కమలమ్మ అనడంతో ఆమెపై శివ, అరుణ కలిసి దాడికి పాల్పడ్డారు. తన తల్లి కమలమ్మను శివ, అరుణ కలిసి కొడుతున్నారని తెలుసుకున్న లక్ష్మీనారాయణ అక్కడ చేరుకుని అడ్డుకోబోగా లక్ష్మీనారాయణ తలపై ఇనుపరాడ్డుతో శివ బలంగా కొట్టి హత్యచేసేందుకు ప్రయత్నించాడు. హత్యాయత్నంలో తీవ్రంగా గాయపడిన లక్ష్మీనారాయణను చికిత్సకోసం ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య పావనిరాణి ఫిర్యాదు మేరకు తల్లాడ ఎస్ఐ ఎన్.వెంకటకృష్ణ హత్యకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

40కిలోల నల్లబెల్లం పట్టివేత



పోలీసుల అదుపులో నిందితుడు

టేకులపల్లి, జూలై 23(ఆంధ్రజ్యోతి): నాటుసారాయికి వినియోగించే బెల్లం, పటికను ఎక్సైజ్ టాస్క్‌ఫోర్సు పోలీసులు పట్టుకున్నారు. బుధవారం మండలంలోని బొమ్మనపల్లి క్రాస్‌రోడ్డు వద్ద కొత్తగూడెం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్సు పోలీసులు సమాచారం మేరకు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో మోటారుసైకిల్‌పై 40కిలోల బెల్లం, రెండు కిలోల పటిక, 2లీటర్ల నాటు సారాయితో వస్తున్న బిల్లుడుతండాకు చెందిన బానోతు కిషన్ పట్టుబడ్డాడు. నిందితునిపై కేసు నమోదు చేసినట్టు డీటీఎఫ్ ఎస్ఐ గౌతమ్ తెలిపారు. ఈ తనిఖీల్లో సిబ్బంది రామకృష్ణగౌడ్, హబీబ్ పాషా, వెంకటనారాయణ, సుమంత్, శ్రావణి, రమేష్, ప్రార్థసారథి పాల్గొన్నారు.

బురదగొర్రుపై నుంచి పడి వ్యవసాయ కూలీ మృతి



బానోతు ఈరు(ఫైల్)

టేకులపల్లి, జూలై 23(ఆంధ్రజ్యోతి): పొలంలో బురదగొర్రు దున్నుతూ ఆకస్మతుగా గొర్రుపైనుంచి కింద పడి వ్యవసాయ కూలీ మృతి చెందిన సంఘటన మండలంలోని బొమ్మనపల్లిలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బొమ్మనపల్లి గ్రామానికి చెందిన కౌలు రైతు దొడ్ల శంకర్‌కు చెందిన వరిపొలంలో బుధవారం వరినాటువేస్తున్న క్రమంలో మంగ్యాతండా గ్రామానికి చెందిన బానోతు ఈరు(55) బురదగొర్రు దున్నటానికి కూలీపనులకు వచ్చారు. పొలం దున్నుతున్న క్రమంలో ఆకస్మాత్తుగా గొరుపై నుంచి బురదపొలంలో పడిపోయాడు. వెం టనే అక్కడ నాటువేసే కూలీలు ఆస్పత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు టేకులపల్లి ఎస్ఐ రాజేందర్ తెలిపారు.

వ్యవసాయ కూలీ కుటుంబ సభ్యుల ఆందోళన

వ్యవసాయ కూలీ బానోతు ఈరు మృతికి కౌలు రైతు నిర్లక్ష్యంమే కారణమని పేర్కొంటు మృతుని బంధువులు, మంగ్యాతండ గ్రామస్థులు మృతదేహాన్ని బొమ్మనపల్లిలోని కౌలురైతు శంకర్ ఇంటివద్ద ఉంచి ఆందోళన చేశారు.

విషయం తెలుసుకున్న టేకులపల్లి సీఐ బత్తుల సత్యనారాయణ, టేకులపల్లి, బోడు ఎస్ఐలు రాజేందర్, శ్రీకాంత్‌లు సిబ్బందితో అక్కడికి చేరుకొని మృతుని కుటుంబ సభ్యుల మాట్లాడి శాంతింపచేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

ఖమ్మం క్రైం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని బ్యాంక్ కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లోని ప్లాట్‌లో మంగళవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో ఇంట్లో ఎలక్ట్రికల్ వస్తువులు కాలిపోయాయి. ఆ సమయంలో అదే గదిలో నిద్రిస్తున్న తన్నీరు కోటమ్మ(98) తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. మంటలు వ్యాప్తించడంతో నిద్రలేచి ఆమె గడియతీసుకోని బయటకి వచ్చారు. సుమారు లక్షన్న రూపాయల ఆస్తి నష్టం జరిగిందని బాధితులు తెలిపారు.

కన్నవారికి మిగిలిన కన్నీరు

- అశ్రునయాలమధ్య యువతి, యువకుడి అంత్యక్రియలు
- పిల్లల ఆత్మహత్యతో తల్లిదండ్రుల మనోవేదన

కారేపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : కామేపల్లి మండలం పండితాపురంలో మంగళవారం సాయంత్రం బండి హారిక(20), గాడేపల్లి శ్రీకాంత్ (24) గంటల వ్యవధిలో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. వారి బలవన్మరణాలు కన్నవారికి కన్నీటిని మిగిల్చగా.. ఇరుకుటుంబాల్లో, గ్రామంలో విషాదాన్ని నింపాయి. పోస్టుమార్టం అనంతరం ఖమ్మం ఆస్పత్రి నుంచి మృతదేహాలను గ్రామానికి తీసుకురాగా బుధవారం వారి అంత్యక్రియలను కుటుంబసభ్యులు, బంధువులు పూర్తిచేశారు. మృతదేహాలకు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, మేకలమల్లి బాబు, సొసైటీ చైర్మన్ ధనియాకుల హనుమంతరావు నివాళులర్పించారు. ఎదురెదురు ఇళ్లలో ఉండే హారిక, శ్రీకాంత్ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారన్న విషయం తమ దృష్టికి తీసుకొచ్చి ఉంటే వారికి వివాహం చేసేవారమని వారి కుటుంబీకులు కన్నీరు మున్నీరయ్యారు. తొందరపాటు నిర్ణయంతో తనువు చాలించి తమకు కడుపుకోత మిగిల్చారని తల్లిదండ్రులు రోదించిన తీరు అక్కడి వారిని కంటతడి పెట్టించింది. ఇదిలా ఉంటే తమ పిల్లల ఆత్మహత్యలపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని హారిక తండ్రి బండి లచ్చినర్సు, శ్రీకాంత్ తండ్రి గాదేపల్లి సారయ్య వేర్వేరుగా తమకు లిఖితపూర్వకంగా ఇచ్చినట్టు ఎస్ఐ బి.సాయికుమార్ తెలిపారు. ప్రేమజంట ఆత్మహత్య నేపథ్యంలో గ్రామం ఎలాంటి అవాఛానీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

పాలేరు వాగులో యువకుడి గల్లంతు

నేలకొండపల్లి, జూలై23(ఆంధ్రజ్యోతి): పాలేరు వాగులో యువకుడు గల్లంతైన సంఘటన బుధవారం మండల పరిధిలోని పైనంపల్లి గ్రామం వద్ద జరిగింది. వివరాల ప్రకారం.. పైనంపల్లికి చెందిన సిద్దెల ఆదిత్య గ్రామంలోని కాలనీకి చెందిన మరో ఐదుగురితో కలిసి పైనంపల్లి వద్ద పాలేరు వాగులోఉన్న ఓరైతుకు చెందిన మోటారును బయటకు తీయటానికి వెళ్లినట్లుగా గ్రామస్థుల ద్వారా తెలుస్తోంది. మోటర్‌ను బయటకు లాగే క్రమంలో నీటి ప్రవాహానికి ఆదిత్య కొట్టుకుని పోయాడు. ఆదిత్య వరదలో కొట్టుకుపోతున్న క్రమంలో సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం శాంతినగర్‌కు చెందిన కొంత మంది వాగులో చేపలు పడుతున్నారని, వారు కాపాడటానికి ప్రయత్నించినప్పటికీ లాభం లేకుండా పోయిందని తెలుస్తున్నది. ఉదయం వెళ్లిన ఆదిత్య సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు గ్రామంలో విచారణ చేయగా ఆదిత్యతో కలిసి వెళ్లిన వారు, వాగులో కొట్టుకు పోయాడని చెప్పడంతో, ఇంత వరకు ఎందుకు చెప్పలేదని వారితో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. బుధవారం రాత్రి వాగులో కొట్టుకుని పోయిన ఆదిత్య తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయటానికి పోలీస్ స్టేషన్‌కు వెళ్లినట్లు సమాచారం. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



జిల్లాలో ఎరువుల కొరత లేదు

» కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు » కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం కలెక్టరేట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు సరిపడినంత ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఎక్కడా ఎరువుల కొరత లేదని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఎక్కడైనా ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే, అధిక ధరలకు విక్రయించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌కు సంబంధించి జిల్లాలో 3 లక్షల 80 వేల 852 ఎకరాల్లో ప్రధాన పంటలైన వరి, పత్తి, అపరాలు, మొక్కజొన్న సాగులో ఉన్నాయన్నారు. వానాకాలం పంట కాలం మొత్తానికి 41 వేల మెట్రిక్ టన్నుల యూరియా, 26 వేల 464 మెట్రిక్ టన్నుల డీఏపీ, 20 వేల 857 మెట్రిక్ టన్నుల ఎంవోపీ, 88 వేల మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 6 వేల 780 మెట్రిక్ టన్నుల ఎస్ఎస్పీ అవసరమని అంచనా వేసినట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌లో రైతులు ఎరువుల సరఫరా పంపిణీపై ఫిర్యాదు టోల్ ఫ్రీ నెం. 1077, సెల్ నెంబర్ 9063211298 లకు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. రాష్ట్ర స్థాయిలో ఫిర్యాదు కోసం 8977741771 లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

లాభసాటి పంటలను సాగు చేయాలి

» మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రఘునాథపాలెం, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలో లాభసాటి వ్యవసాయ పంటలపై రైతులు దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం పరికలబోడు తండాలో రూ.3 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గుడిసెలు లేని గ్రామాలు నిర్మాణం చేయటమే ఇందిరమ్మ ప్రభుత్వం లక్ష్యమన్నారు. ఎక్కడైనా నిరుపేదలు గుడిసెల్లో ఉంటున్న ఫొటోలు తీసుకొని వస్తే వారికి వెంటనే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తామన్నారు. అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారునికి రేషన్‌కార్డులు మంజూరు చేస్తామన్నారు. మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా మండలంలోని 33 చెరువులకు సాగు నీరు అందిందన్నారు. నాగార్జున్‌సాగర్‌కు గురువారం నుంచి నీటి విడుదల జరుగుతుందన్నారు. రైతులు పామాయిల్, వక్క వంటి పంటలను సాగు చేయాలని కోరారు. పామాయిల్ సాగు చేసిన రైతులకు ప్రభుత్వం ఏకరానికి రూ.50వేల సబ్సిడీ అందిస్తుందన్నారు. రైతులకు అందుబాటులోనే పామాయిల్ ఫ్యాక్టరీ ఉందన్నారు. పిల్లలు మంచిగా విద్యాభ్యాసం చేసేందుకు రఘునాథపాలెం మండల కేంద్రంలో స్వామినారాయణ్, ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు నిర్మాణం చేస్తున్నామన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, జడ్పీ సీఈవో దీక్షారైనా పాల్గొన్నారు.

జిల్లాలో నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మం కలెక్టరేట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేడు జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన ఉదయం 7గంటలకు హైదరాబాద్‌లో బయల్దేరి 10గంటలకు రామన్నపేట ఆంజనేయ దేవస్థానం వద్ద అంతర్గత సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం కార్తికేయ ఫంక్షన్‌హాల్లో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు మంజూరు అందచేస్తారు. 12గంటలకు వైరాలో టీయూ డబ్ల్యూజే(ఐజేయూ) మహాసభలకు హాజరవుతారు. గోళ్లపాడు, ఊటవాగుతండాలో పల్లెగూడెం, నుంచి మంగళగూడెం, జడీప రోడ్డు నుంచి ఊటవాగు తండా, అక్కడి నుంచి ఆకేరురోడ్డుకు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

మెడికల్ కాలేజీకి 10మంది ప్రొఫెసర్ల కేటాయింపు

ఖమ్మం కలెక్టరేట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం మెడికల్ కళాశాలకు 10 మంది ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లను కేటాయిస్తూ డాక్టర్ క్రిస్టినా చోంగ్తూ ఉత్వర్వులు జారీ చేశారు. ఈ మేరకు వివిధ స్పెషాలిటీల్లో ప్రొఫెసర్లుగా పదోన్నతికి అర్హులైన వారికి పోస్టింగ్‌లను కల్పించారు. ఈ మేరకు వివిధ కళాశాలల్లో పని చేస్తున్న 10మందికి ప్రొఫెసర్లుగా కేటాయించారు. జనరల్ మెడిసిన్‌కు-2, జనరల్ సర్జన్‌కు-1, ఆప్తామాలజీకి-1, రేడియాలజిస్ట్ -1, డెర్మటాలజీ-1, బయోకెమిస్ట్రీ, పిడియాట్రిక్, ఫిజియాలజీ, ఎస్‌పీఎం ఒకరు చొప్పున కాలేజీకి కేటాయించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఓ అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. గత నాలుగు రోజుల క్రితం నగరంలోని రైల్వేస్టేషన్ రెండవ ప్లాట్ ఫాంపై మృతి చెందిన(75) వృద్ధుడి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. అతని కోసం ఎవరు రాకపోవడంతో అనాథ మృతదేహంగా భావించి రైల్వే పోలీసులు, ఆసుపత్రి సిబ్బంది సమక్షంలో అన్నం శ్రీనివాసరావు మృతదేహాన్ని స్వాధీనపరుచుకొని నగరంలోని బల్లేపల్లి వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

చెల్లని చెక్కు కేసులో నెల రోజుల జైలు

ఖమ్మం లీగల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కొణిజర్ల మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన ఈ.జనార్ధన్‌కి చెల్లని చెక్కు కేసులో నెల రోజులు జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం మూడవ అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి వినుకొండ మాధవి బుధవారం తీర్పుచెప్పారు. కేసు వివరాల ప్రకారం.. కొణిజర్ల మండలం పల్లిపాడు గ్రామానికి చెందిన రాంపూడి రోశయ్య వద్ద నిందితుడు తన కుటుంబ అవసరాల నిమిత్తం 4 ఏప్రిల్ 2019న రూ.ఏడు లక్షలను అప్పుగా తీసుకొని అదేరోజు ప్రాంసరీ నోటు రాయించి ఇచ్చాడు. నిందితుడు 23 మార్చి 2020న రూ. ఏడు లక్షలకు చెక్కును ఇచ్చాడు. చెక్కును ఫిర్యాది తన బ్యాంకు ఖాతాలో జమచేయగా నిందితుని ఖాతాలో సరిపడా నగదు లేకపోవడంతో చెక్కు తిరస్కరణకు గురైంది. ఫిర్యాది తరుపున న్యాయవాది కన్నేటి వెంకట రమణారావు ద్వారా లీగల్ నోటీసు జారీచేసి కోర్టులో ప్రైవేటు కేసు దాఖలుచేశారు. కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువు కావడంతో శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

అచ్యుతానందన్‌కు నివాళి

తిరుమలాయపాలెం, జూలై23(ఆంధ్రజ్యోతి): కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్‌కు బుధవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో రామారావు, వెంకటేష్, దిలీప్, రాజేష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్ఆర్‌బీజీ ఎన్.ఆర్ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి అతిథి (గెస్ట్) అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాచ్‌లర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్-3, బ్యాచ్‌లర్‌ఆఫ్ కంప్యూటర్ (బీసీఏ)-2, బయోటెక్నాలజీ-1 -బాటనీ-1, బిజినెస్ అనలిటిక్స్-1, కామర్స్ -1, కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్స్-8, డేటా సైన్స్-1, ఇంగ్లిష్-1, హిస్టరీ -3, మేథమెటిక్స్-2, పొలిటికల్ సైన్స్ -2, స్టాటిస్టిక్స్-1, తెలుగు-1, ఖాళీగా ఉన్నయని అతిథి అధ్యాపక పోస్టులకు అర్హులైన అభ్యర్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 26వ తేదీ లోగా దరఖాస్తులను కళాశాల కార్యాలయంలో అందించాలని తెలిపారు. ఇంటర్వ్యూలు 29 వతేదీ ఉదయం 10గంటల నుంచి కళాశాలలో జరుగుతాయన్నారు. ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు పీజీలో50శాతం, ఇతర అభ్యర్థులకు 55శాతం మార్కులు తప్పనిసరిగా ఉండాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం

» సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటాలు నిర్వహిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పేర్కొన్నారు. బుధవారం గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మధిరలో నిర్వహించిన జిల్లా సమితి సమావేశాలను వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఆరు గ్యారెంటీ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బీజే క్లైమెట్, మౌలానా, యర్రా బాబు, జానిమియా, ఏపూరి లతాదేవి, గోవిందరావు, కర్ణకుమార్, తాటి వెంకటేశ్వరరావు, కమలాకర్, మేకల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డీఎస్పీ రమేష్‌కు బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు

ఖమ్మం క్రైం, జూలై 23(ఆంధ్రజ్యోతి): అవినీతి నిరోధక శాఖ ఖమ్మం రేంజ్ డీఎస్పీ వై. రమేష్‌కు బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డువరించింది. ఈ ఏడాది తొలి ఆరు నెలల కాలంలో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు గుర్తింపుగా ప్రభుత్వం ఈ పురస్కారాన్ని ప్రకటించింది. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో అవినీతి నిరోధక శాఖ డీజీపీ విజయ్‌కుమార్ చేతుల మీదుగా రమేష్ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. డీఎస్పీ రమేష్ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో లంచం తీసుకుంటుండగా పలువురు అధికారులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రమేష్‌కు అధికారులు బంధువులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రశాంత వాతావరణాన్ని అందించాలి

» డీఎంహెచ్‌వో కళావతిబాయి

ఖమ్మం కలెక్టరేట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రోగులకు శారీరక, మానసిక ప్రశాంతతను కల్పించే వాతావరణాన్ని అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. కళావతిబాయి అన్నారు. బుధవారం జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పాలియేటివ్ కేర్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమెరోగులతో మాట్లాడారు. తీవ్రమైన, దీర్ఘకాలిక అనారోగ్యాలతో బాధపడుతున్న రోగులకు అక్కడ అందిస్తున్న చికిత్సలు, వ్యాధి వల్ల కలిగే బాధను వారిని అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో అందుతున్న సేవలు వైద్యుల విధులు, నర్సింగ్ ఆఫీసర్ల విధుల గురించి అడిగితెలుసుకున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న పేషంట్లకు పాలియేటివ్ కేర్‌లో పూర్తి చికిత్సలను అందించాలన్నారు. ఆమె వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్. నరేందర్, ఎన్సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రామారావు, ఆర్ఎంవో డాక్టర్ రాంబాబు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, కిరణ్‌కుమార్, ఎస్టాబ్లిష్మెంట్ సూపరింటెండెంట్ రవి కిషోర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో కళావతిబాయి

అన్ని విధాలా ఆదుకుంటాం: సీపీ



కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మం క్రైం, జూలై 23(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు నిర్వహిస్తూ ఈ ఏడాది ఏప్రిల్ 1న మృతి చెందిన కానిస్టేబుల్ బి. కృష్ణ కుటుంబ సభ్యులకు రూ. 8లక్షల భద్రత ఎక్స్‌గ్రేషియా చెక్కును బుధవారం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ శాఖ పరంగా సహాయ సహకారాలు అందిస్తామని అనానరు. పోలీస్ అధికారులు అందుబాటులో ఉంటారని అన్నారు. పోలీసు కుంటుంబాలకు అన్ని విధాల ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

క్యాజువాలిటీకి కొత్త హంగులు

ఖమ్మం మామిళ్లగూడెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో క్యాజువాలిటీకి నూతనహంగులు సమకూర్చారు. ఇటీవల జిల్లా ఆస్పత్రిని సందర్శించిన డీఎంఈ (వైద్యవిద్య డైరెక్టర్) సూచనల మేరకు క్యాజువాలిటీ పరిధిని విస్తరించారు. డాక్టరు రోగులను పరీక్షించేందుకు వీలుగా చేర్పులు మార్పులను చేపట్టారు. ఈ నేపథ్యంలో వారం రోజులుగా సాగిన ఈ పనులను మంగళవారం పూర్తి కావడంతో బుధవారం క్యాజువాలిటీని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట ఆర్ఎంవో డాక్టర్ రాంబాబు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, కిరణ్‌కుమార్, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది ఉన్నారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం

ఖమ్మం మామిళ్లగూడెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ విద్యాసంస్థల్లో పెరుగుతున్న పాఠశాల ఫీజుల భారం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సౌకర్యాలను కల్పించాలని కోరుతూ టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగునాడు విద్యార్థి సమాఖ్య నాయకులు కన్నేటి పృధ్వీ మాట్లాడుతూ ప్రైవేటు యాజమాన్యాలు తల్లిదండ్రులను ఫీజుల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేకపోవడం కారణంగా ప్రైవేటు యాజమాన్యాలు ఇష్టారీతిగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. వీటని నియంత్రించాల్సిన అధికారులు నిర్లక్ష్యం గా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాల ఫీజులను నియంత్రించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలను మెరుగుపరచాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డే చందు, లహరిన్, సాయి, క్రాంతి, భార్గవ్, తేజ తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంలో....

ఖమ్మం రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా విద్యారంగ సమస్యల పరిష్కారానికి రూరల్ మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల బుధవారం బంద్ నిర్వహించాయి. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎరుకల యశ్వంత్ మాట్లాడుతు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 గడుస్తున్నా ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రిని నియమించలేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రణయ్, సాయి, సిద్ధు, తదితరులు పాల్గొన్నారు.



తిరుమలాయపాలెంలో నిరసన ..

తిరుమలాయపాలెం: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ విజయవంతంగా జరిగింది. ఈసందర్భంగా మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలను ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో తరగతులు బహిష్కరించారు. ఈకార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు గాదే వరుణ్, మాచర్ల మధు, గౌతమ్, నవీన్, రాము, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

జీవో 282ను రద్దు చేయాలి

» టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రామయ్య

ఖమ్మం రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): పని గంటల పెంపు జీవో 282 జీవోను వెంటనే రద్దు చేయాలని టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం జరిగిన పాలేరు ఏరియా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ హమాలీ, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్స్ ఆశా, అంగన్‌వాడీల కార్మికులకు జీతాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల పక్షాన పోరాడుతామన్నారు. ఈనెల 31న ఖమ్మం కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాలో అన్ని రంగాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి శీలం లెనిన్, మాధవరావు, ఉపేందర్, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

తిరుమలాయపాలెం, జూలై23(ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో బుదవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో ఆసంఘం బాధ్యులు ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయల బదిలీలు, ప్రమోషన్లు వెంటనే నిర్వహించాలన్నారు. ఆగస్టు1న జిల్లా కేంద్రంలో ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, ఆగస్టు 23న చలో హైదరాబాదు చేపడుతున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సంఘం నాయకులు కేశ్యా, వెంకటరాములు, లక్ష్మి, భద్రమ్మ, ధనమూర్తి, రఘుబాబు, సుబాషిణి, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

బీసీలంతా రాజ్యాధికారం దిశగా పయనించాలి



సురేష్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఖమ్మంచర్చికాం పౌండ్, జూలై23(ఆంధ్రజ్యోతి): బీసీలంతా రాజ్యాధికారం దిశగా పయనించాలని వ్యవసాయమార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండాల కృష్ణ అన్నారు. బుధవారం సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన దండి సురేష్‌కు మున్నూరుకాపు సంఘం నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు కూరాకుల నాగభూషణం, కత్తి నెహ్రూ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా గుండాల కృష్ణ మాట్లాడుతూ మిగతాపార్టీలు కూడా బీసీలకు తగు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అదేవిధంగా బీసీలంతా ఒకతాటిపైకి వచ్చి 42శాతం రిజర్వేషన్‌తోపాటు త్వరలో జరిగే కేంద్ర కులగణనను కూడా విజయవంతం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త సీతారాములు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం, గీతా వెంకన్న, కనకం జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో వర్షపునీరు తొలగింపు

ఖమ్మం రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పెద్దతండా, ఏదులాపురం పరిధిలోని వివిధ కాలనీలలో కొద్దిపాటి వర్షానికి వర్షపు నీరు భారీగా నిలుస్తుంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం పెద్దతండా, ఆర్టీసీ కాలని, సాయిగణేష్‌నగర్, తెల్దారుపల్లి, శ్రీరాంనగర్, కాలనీలలో నిలిచిన వర్షపు నీటిని ఎక్స్‌కవేటర్ సహాయంతో కాలువల ద్వారా తొలగించారు. కాలువలలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించారు. ఈ కార్యక్రమంలో పిల్లి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు

» మునిగిన వరి పొలాలు



వరదకు మునిగిపోయిన పొలాలు

నేలకొండపల్లి, జూలై23(ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. చెరువులు జల కళను సంతరించుకున్నాయి. వాగులు పొంగి పొర్లుతుండటంతో నాట్లు వేసిన వరి పొలాలు పూర్తిగా నీట మునిగిపోయాయి. వర్షాలిలానే ఉంటే రైతులకు భారీ నష్టం జరిగే అవకాశాలున్నాయి.

వివాదాల మెప్మా

» కొత్త సంఘాల ఏర్పాటు సమావేశంలో పాత పంచాయితీలు

» మధ్యలోనే వెళ్లిపోయిన సీఆర్‌పీలు



మాట్లాడుతున్న డీఎంసీ సుజాత

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 23(ఆంధ్రజ్యోతి): మహిళా స్వయం సహాయక సంఘాల్లో ప్రతి మహిళను సభ్యురాలిగా చేర్చాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల వెలుగుమట్ల సభలో జరిగిన మహిళ సంఘాల వడ్డీ మాఫీ సమావేశంలో కోరారు. 2లక్షలు మహిళలు ఉన్న ఖమ్మం నగరంలో కేవలం 40వేల మంది మహిళలు మాత్రమే మహిళా స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉండటంతో వారికి ప్రభుత్వ పథకాలు అందడం లేదని, ప్రతి మహిళను సభ్యురాలిగా చేర్చాలని సూచించారు. ఈ మేరకు మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య స్పందించారు. మహిళా సంఘాలు ఏర్పాటుకు ప్రత్యేకంగా శిక్షణ పొందిన సీఆర్పీలను నియామకం చేసుకొని 40రోజుల వ్యవధిలో కనీసం 100 సంఘాలను ఏర్పాటు చేయాలని మెప్మా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సీఆర్పీలకు చెల్లించేందుకు నిధులు కూడా వారం రోజుల క్రితమే మంజూరు చేశారు. కొత్త సంఘాల ఏర్పాటు కోసం బుధవారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో డీఎంసీ సావల సుజాత, టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, సీవోలు, సీఆర్‌పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త సంఘాల లక్ష్యాల విషయాలు పక్కకు పోయి, 28, 29 డివిజన్‌ల్లో పాత బకాయిలు వసూళ్లకు ఎందుకు వెళ్లారని సమావేశానికి వచ్చిన సీఆర్‌పీలను ప్రశ్నించారు. దీంతో మెప్మాలో పాత పంచాయతీలు బయటకు వచ్చాయి. కాగా సమావేశం నుంచి సీఆర్‌పీలు మధ్యలోనే వెళ్లి పోయారు. సీఆర్పీల సమావేశం వివాదాలతో ముగియ డం మెప్మాలో చర్చనీయాంశంగా మారింది. మెప్మా ప్రా జెక్టు డైరెక్టర్ అభిషేక్ అగస్త్య స్వయంగా సమావేశాలు నిర్వహించకుంటే మెప్మా దారిలో పడే అవకాశాలు లేవని మహిళా సంఘాలు ఆరోపిస్తున్నాయి.

సజావుగా దేవాలయ భూముల కౌలు వేలం

నేలకొండపల్లి, జూలై23(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లిలోని శ్రీరాజగోపాలస్వామి దేవాలయ భూముల కౌలు బహిరంగ వేలం ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. మూడు సార్లు వేలం పాట ను జరగకుండా అడ్డుకున్న రైతులు, బుధవారం మరోసారి నిర్వహించిన వేలాన్ని సజావుగా సాగటానికి సహకరించారు. కాశిబోయిన ఉప్పలయ్య అనే రైతు 13.25ఎకరాల పొలాన్ని రూ.2.41లక్షల కౌలుకు పాడుకున్నాడు. గతంలో రూ.1.86లక్షలకు రైతులు కౌలు పాట పాడగా ప్రస్తుతం రూ.55వేలు ఎక్కువగా పాట పోయింది. ఆగస్టు 5, 6తేదీల్లో పొలం సర్వే చేయించటానికి రెవెన్యూ అధికారులు హామీ ఇచ్చినట్లుగా ఈవో శ్రీకాంత్ చెప్పారు. ఆలయ చైర్మన్ మన్నె రవికుమార్, ఈవో శ్రీకాంత్, వీఆర్వో శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు జిల్లాలో ఉన్నత విద్యాశాఖ కమిషనర్ దేవసేన పర్యటన

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యాశాఖ కమిషనర్ దేవసేన గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జిల్లాలోని పలు పాఠశాలలను సందర్శిస్తారు. మధ్యాహ్నం 1:30 గంట నుంచి 3:30 గంటల వరకు నగరంలోని టేకులపల్లి డైట్ కళాశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడుతారు.

అనంతరం మధ్యాహ్నం 4గంటల నుంచి నూతన కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించనున్నారు. సాయంత్రం కారేపల్లిలోని మోడల్ స్కూల్‌ను సందర్శిస్తారు. జిల్లాలో పీఎంశ్రీ కింద ఎంపికైన పాఠశాలలను పరిశీలించనున్నారు.



ఆంధ్రజ్యోతి

● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు, జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి

ZONE
గురువారం 24 జూలై 2025
వైరా-మధిర
సత్తుపల్లి
WYRA, MADHIRA, SATHUPALLY

విద్యా సంస్థల బంద్ విజయవంతం



తల్లాడ బంద్‌లో పాల్గొన్న నాయకులు



సత్తుపల్లిలో ర్యాలీ



మధిరలో పాల్గొన్న విద్యార్థులు, నాయకులు

తల్లాడ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తల్లాడ మండలంలో బుధవారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతం అయింది. పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి గాజుల శశికిరణ్, మండల నాయకులు నగేష్, అభిలాష్, అనిల్, రియాజ్, కిషోర్ పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి సంఘాలు రాష్ట్రవ్యాప్త బంద్ కోసం ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ప్రభుత్వం దిగివచ్చి పెండింగ్‌లోని స్కాలర్‌షిప్స్, రీఎంబర్స్‌మెంట్, బెస్ట్ ఎవైలబుల్ బాకీలను విడుదల చేస్తూ ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బోనకల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రిని ఇప్పటికీ కేటాయించకపోవడం దారుణమని విద్యార్థు సంఘాల నాయకులన్నారు. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఇండ్ల సుదాకర్, సంతోష్, అజయ్, నవీన్, మర్రి సాయి కుమార్, ఎన్. రోహిత్, మహిమ, జ్యోతి పాల్గొన్నారు.

మధిర రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, రీయంబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాలు తలపెట్టిన విద్యాసంస్థల బంద్ బుధవారం మధిరలో విజయవంతమైంది. ఆయా సంఘాల నాయకులు మడుపల్లి లక్ష్మణ్, మధు, గోపినాథ్, నరేంద్రసాయి, గోపి మోహన్ పాల్గొన్నారు.

ముదిగొండ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఫీజురియంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం ముదిగొండలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో కొమ్ము మహేష్, నవీన్, శ్రీచరణ్, అఖిల్, సాధిక్ పాల్గొన్నారు.

కారేపల్లి జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం నిర్వహించిన విద్యాసంస్థల బందు విజయవంతం అయింది. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఏఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ సంఘాల ఆధ్వర్యంలో బందు కార్యక్రమం నిర్వహించారు.



ముదిగొండ ర్యాలీలో నాయకులు, విద్యార్థులు



బోనకల్ బంద్‌లో విద్యార్థి సంఘం నాయకులు



కారేపల్లిలో..

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

చింతకాని, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సిఫారసు మేరకు మండల పరిధిలోని నాగులవంచ గ్రామానికి చెందిన 16 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి నిధులు రూ 6 లక్షల 49 వేల విలువగల చెక్కులను పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు బుధవారం పంపిణీ చేశారు. నాయకులు కంభం వీరభద్రం, కంచుమర్తి రామకృష్ణ, వెచ్చ మంగయ్య, ఎల్లంపల్లి అప్పారావు, ముత్తినేని వెంకటేశ్వర్లు, జయకుమార్, రమేష్, ఎల్లంపల్లి సీతరామయ్య, శంకర్‌రావు పాల్గొన్నారు.

బోనకల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నబీరవల్లి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతు వైద్య చికిత్స చేయించుకున్న సంగేపు సీతారాములుకు రూ. 60వేలు, ముళ్ల పాటి నర్సింహారావుకు రూ. 57,500 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం గ్రామ కాంగ్రెస్ నాయకుడు చంద్ర శ్రీనివాసరావు అందజేశారు. చెక్కులను సకాలంలో మంజూరు చేయించినందుకు గానూ డిప్యూటీ సీఎం విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు పెద్ద కాంతయ్య, నాగేశ్వరరావు, రమేష్‌బాబు, మల్లికార్జున్ పాల్గొన్నారు.



చెక్కులను అందజేస్తున్న నాయకులు

జిల్లాలో ఎరువుల కొరత లేదు

» కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

» కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం కలెక్టరేట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు సరిపడినంత ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఎక్కడా ఎరువుల కొరత లేదని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఎక్కడైనా ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌కు సంబంధించి జిల్లాలో 3 లక్షల 80 వేల 852 ఎకరాల్లో ప్రధాన పంటలైన వరి, పత్తి, మొక్కజొన్న సాగులో ఉన్నాయన్నారు. వానాకాలం పంట కాలం మొత్తానికి 41 వేల మెట్రిక్ టన్నుల యూరియా, 26 వేల 464 మెట్రిక్ టన్నుల డీఏపీ, 20 వేల 857 మెట్రిక్ టన్నుల ఎంఓపి, 88 వేల మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 6 వేల 780 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని అంచనా వేసినట్లు కలెక్టర్ తెలిపారు. రైతులు తమ ఆధార్ కార్డ్ వినియోగించి ఎరువులు కొనుగోలు చేయాలన్నారు. కలెక్టరేట్‌లో రైతులు ఎరువుల సరఫరా పంపిణీపై ఫిర్యాదు టోల్ ఫ్రీ నెం. 1077, సెల్ నెంబర్ 9063211298 లకు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. రాష్ట్ర స్థాయిలో ఫిర్యాదు కొరకు సెల్ నెం. 8977741771ని ప్రభుత్వం కేటాయించిందని కలెక్టర్ తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే బీజేపీ లక్ష్యం

» నాయకులు నంబూరి, ఏలూరి

తల్లాడ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు కృషిచేయాలని బీజేపీ ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు కోరారు. బుధవారం స్థానిక జీఎన్ఆర్ గార్డెన్స్‌లో పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు చల్లా నాగులు అధ్యక్షతన జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరగబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలలో బీజేపీ అన్నిస్థానాలలో పోటీ చేస్తుందని, అత్యధిక స్థానాలు గెలవడమే ధ్యేయంగా పని చేయాలని కోరారు. పార్టీ జిల్లా నాయకులు అపతి వెంకటరామారావు, గాదే కృష్ణారావు, మండల ప్రధాన కార్యదర్శులు రాయల రమేస్, పెరిక కిరణ్, కోశాధికారి యద్దనపుడి శ్రీనివాసరావు,ఉపాధ్యక్షులుగొల్లమందల నరేష్, గురునాథం, కార్యదర్శులు చల్లా నరేష్, తమ్మిశెట్టి కృష్ణ, వీరయ్య పాల్గొన్నారు.

బోనకల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేసి సత్తా చాటాలని ఆ పార్టీ మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు కోరారు. బోనకల్‌లో బుధవారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో ప్రతి చోట బీజేపీ అభ్యర్థులు పోటీలో ఉండాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షురాలు తాళ్లూరి మౌనిక, నాయకులు మట్టా దుర్గా ప్రసాద్‌రెడ్డి, పాపారావు, తాళ్లూరి సురేష్, జంపాల రవి, మరీదు పరుశురామ్, బోయినపల్లి గోపాల్, దొంతు రాధాకృష్ణ, మామిళ్ల కోటేశ్వరరావు, వజ్రాల మల్లాచారి పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డుల పంపిణీ

ముదిగొండ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త రేషన్‌కార్డులను ముదిగొండ తహసీల్దార్ సునీత ఎల్జిబెత్ బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరూ రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఆర్ఐలు కల్యాణి, ప్రసన్నకుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, నాయకులు ఉసికల రమేష్, కందిమళ్ల వీరబాబు, మాదాల శ్రీనివాస్, బూర్గు శ్రీను, కొమ్ము నర్సింహారావు పాల్గొన్నారు.

బీమా నగదు అందజేత

ఎర్రుపాలెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఎర్రుపాలెంలోని డీసీసీబీ బ్యాంకులో అయ్యవారిగూడెం వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సభ్యుడికి బీమా నగదును బుధవారం అందించారు. సొసైటీ పరిధిలోని సహకారసంఘ సభ్యులైన రాజుల దేవరపాడు గ్రామానికి చెందిన పొదిలి సరవయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయనకు అయ్యవారిగూడెం సహకార సంఘంలో సభ్యత్వం ఉండడంతో ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.50వేల బీమా నగదును సర్వయ్య భార్య వెంకట్రావమ్మకు సొసైటీ అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు అందించారు. డీసీసీబీ మేనేజర్ దివ్య, అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్, సెక్రటరి మోహనరావు, సిబ్బంది మురళి, రమణారెడ్డి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

సత్తుపల్లిని క్లీన్ సిటీగా ఉంచాలి

» కమిషనర్‌కు మంత్రి తుమ్మల ఆదేశం

సత్తుపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణాన్ని క్లీన్, బ్యూటీఫుల్ సిటీగా ఉంచాలని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. బుధవారం ఆయన స్వగ్రామం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గండుగులపల్లిలో సత్తుపల్లి మునిసిపల్ కమిషనర్ కె.నరసింహా మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో సత్తుపల్లి అభివృద్ధిని చూసేందుకు ఇతర ప్రాంతాల నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు సంబంధిత అధికారులను ఇక్కడికి పంపించేవారని, అలాంటి పట్టణాన్ని ఎవరూ వేలెత్తి చూపించకుండా నిర్మించాలని చెప్పారు. వర్షాకాలం దృష్ట్యా డ్రెయినేజీ, రహదారులను ఎప్పుడూ శుభ్రంగా ఉంచాలని పట్టణాభివృద్ధిపై కీలక సూచనలు చేశారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న యుఎస్‌పీసీ నాయకులు

బోనకల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఆ సంఘ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దశల వారి పోరాటాల్లో భాగంగా సమస్యలపై వినతి పత్రాన్ని యుడీసీ ఉపేందర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ మాట్లాడుతూ.. ఈ నెల 23, 24 తేదిలల్లో తహసీల్దార్ కార్యాలయాల ద్వారా వినతి పత్రాలను ముఖ్యమంత్రికి చేరేటట్లు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. వచ్చే నెల 1న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, అదే నెల 23న హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయిలో మహాధర్నా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంగారావు, సదాబాబు, గోపాలరావు, లక్ష్మణరావు, నర్సింహారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భట్టి చిత్రపటానికి క్షీరాభిషేకం



భట్టి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న నాయకులు

ఎర్రుపాలెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క చిత్రపటానికి బుధవారం పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా మధిర మార్కెట్ చైర్మన్ బండారు నరసింహారావు మాట్లాడుతూ.. ఎర్రుపాలెం మండలానికి మండల కేంద్రంలో 133కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణంతోపాటు కొణిజర్ల మండలం పెద్దగోపతి గ్రామం నుంచి ఎర్రుపాలెం వరకు విద్యుత్ లైన్ల నిర్మాణం కోసం సుమారు రూ.100కోట్లను మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి కాంగ్రెస్ నాయకులు శీలం శ్రీనివాసరెడ్డి, పంబి సాంబశివరావు, తల్లపురెడ్డి నాగిరెడ్డి, కడియం శ్రీనివాసరావు, వెంకటనరసయ్య, వెంకట కృష్ణారావు, అప్పారావు, ఏడుకొండలు, జంగా ప్రసాద్‌రెడ్డి,రామిరెడ్డి, రవి, బాబురావు పాల్గొన్నారు.

మహిళలకు ప్రాధాన్యమిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

సత్తుపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అందరూ ఆర్థిక స్వావలంబన పొందేలా మహిళలకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ అని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. 200కోట్ల ఉచిత ప్రయాణాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సత్తుపల్లి ఆర్టీసీ డిపో గ్యారేజీలో నిర్వహించిన వేడుకలలో ఆమె పాల్గొన్నారు. సామాజికంగా మహిళలు ముందడుగు వేసినప్పుడే రాష్ట్రంతో పాటు దేశం అభివృద్ధి చెందుతుందని నమ్మిన సీఎం రేవంత్‌రెడ్డి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే ఉద్దేశ్యంతో సంక్షేమ, అభివృద్ధి పథకాలను రూపొందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసే ఆయా రంగాలు, వ్యాపారాలకు చెందిన మహిళలను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. అంతకముందు మండలంలోని కాకర్లపల్లిలో 5విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, సింగరేణి సౌజన్యంతో గ్రామస్థులకు ఏర్పాటు చేసిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. డీఎం రాజ్యలక్ష్మీ, అసిస్టెంట్ మేనేజర్ పీ.విజయశ్రీ, ఎంఎఫ్ సిలివేరు సాహితీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొన్నారు.



ప్రయాణీకులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

సత్తుపల్లిరూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్య, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో సత్తుపల్లిలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని వినతి పత్రం అందజేశారు. ఉమామహేశ్వరరెడ్డి, చెరుకు శ్రీనివాసరావు, కే.వెంకటేశ్వరరావు, మదుసూదనరావు, నాగేశ్వరరావు, అశోక్, సూరయ్య, రవీంద్రనాద్, చక్రపాణి, మురళీమోహన్, రమేష్, బీ.నరసింహారావు, పుల్లారావు, ఆర్.శ్రీను పాల్గొన్నారు.

తల్లాడ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల తక్షణ పరిష్కారం కోసం దశలవారీ పోరాటాల్లో భాగంగా బుధవారం తల్లాడలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ) ఆధ్వర్యంలో తహసీల్దార్ బాబ్జీప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. విద్యా, ఉపాధ్యాయ రంగంలో ఏళ్ల తరబడి ఉన్న సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని జీవో నెంబరు 25ను సవరించాలని, 50మంది విద్యార్థులు దాటితేనే ముగ్గురు ఉపాధ్యాయులన్న నిబంధనను తక్షణమే ఉపసంహరించుకోవాలని వినతిలో తెలిపారు. యూపీఎస్పీసీ సంఘాల నాయకలు లాలుసయ్యద్, తాళ్లూరి శ్రీనివాసరావు, ఇమ్మానియేల్, ఇందుప్రియి, గిరిజారాణి, మురళీకృష్ణ, రత్నకుమారి, సనత్‌కుమార్, శ్రీదేవి, వింద్యాధర, జగదీష్‌కుమార్, రత్నలీల, శారదాదేవి, ఉషశ్రీ, స్వరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

కేరళ మాజీ సీఎం వీఎస్‌కు ఘన నివాళి

వైరా, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అసాధారణ పోరాట యోధుడు, కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్.అచ్యుతానందన్ మరణం పట్ల వైరా సీపీఎం నాయకులు సంతాపం తెలిపారు. బుధవారం వైరాలో అచ్యుతానందన్ సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు. మాజీ ఎంపీపీ బొంతు సమత, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు, పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, నాయకులు సుంకర సుధాకర్, కురుగుంట్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



విప్లవ జోహార్లు అర్పిస్తున్న నాయకులు

ఆదర్శ కమ్యూనిస్టు పద్మారావు

వైరా, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పేదరికంలోనూ నిబద్ధత కలిగిన ఆదర్శ కమ్యూనిస్టుగా నంద్రు పద్మారావు పనిచేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు నివాళులర్పించారు. వైరా మునిసిపాలిటీ 8వ వార్డులోని బోడేపూడి కాలనీలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన నంద్రు పద్మారావు సంస్మరణ సభను యనమద్ది రామకృష్ణ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం నాయకులు బొంతు రాంబాబు, సుంకర సుధాకర్, తాళ్లపల్లి కృష్ణ, చింతనిప్పు చలపతిరావు, మచ్చా మణి, తూము సుధాకర్, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ లక్ష్మీపురం గ్రామ కమిటీ ఎన్నిక

కల్లూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల పరిధిలో గల లక్ష్మీపురం కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక బుధవారం జరిగింది. అధ్యక్షుడిగా గుగులోతు రాంబాబు, ఉపాధ్యక్షుడిగా వాకదాని వెంకటేశ్వరరావు, కార్యదర్శిలుగా నెల్లూరి నాగేశ్వరరావు, బానోతు శంకర్, పరిగ ప్రతాప్‌రెడ్డి, కోశాధికారిగా పలగాని సూరిబాబు, అజ్మీరబాలు, సభ్యులుగా బాదవత్ ధనసింగ్, భూక్యా వీరయ్య, ధర్మసోతు రవికుమార్, భూక్యా నాగేశ్వరరావు, గుగులోతు చరణ్‌సింగ్, యు సురేందర్‌రెడ్డి, సురేష్ ఎన్నికయ్యారు.

యూరియా కొరత లేదు

ఏన్కూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరత లేదని వైరా సహాయ వ్యవసాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం తిమ్మరావుపేట, ఏన్కూరు, నూకాలంపాడు గ్రామాల్లో ఎరువుల దుకాణాలను తనిఖీచేశారు. స్టాక్‌బోర్డు, పీఓసీ మిషన్లను పరిశీలించారు. వ్యవసాయ శాఖ అధికారులు సూచనలు పాటిస్తూ రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. నానో యూరియా, డీఏపీలను పై పాటుగా పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. ఏవో నరసింహారావు, ఏఈఓలు బాలకృష్ణ, నవ్య, లహరి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

మధిర రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంతోపాటు పలు గ్రామాల్లో బుధవారం వ్యవసాయశాఖ అధికారులు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఏడీఏ విజయ్ చంద్ర, ఏవో సాయిదీక్షిత్‌లు ఎరువుల దుకాణాల్లో ఉన్న నిల్వలను, రికార్డులను పరిశీలించారు. డీలర్లు ఎరువుల కృత్రిమ కొరతను సృష్టించొద్దని అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఈవోలు పాల్గొన్నారు.



అండర్‌బ్రిడ్జి వద్ద నీటమునిగిన ఏవో కారు

కారేపల్లి జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయశాఖ అధికారిగా పనిచేస్తున్న బట్టు అశోక్ కుమార్ బుధవారం పెనుప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు. మండల పరిధిలోని రేలకాయలపల్లిలోని ఎరువుల దుకాణాల తనిఖీ కోసం తన సొంతకారులో బయల్దేరారు. అయితే గాదెపాడు సమీపంలోని అండర్ రైల్వే బ్రిడ్జి కిందనుంచి వెళ్లేందుకు ప్రయత్నం చేశారు. అప్పటికే అండర్‌బ్రిడ్జిలో నీరు నిల్వ ఉండగా లోతు లేదనే బావంతో తన కారును అందులోకి తీసుకెల్లాడు. కారు వెళ్లిన ప్రాంతంలో నీరు అధికంగా ఉండటంతో కారు పూర్తిగా నీట మునిగింది. అద్దం తెరుచుకోవడంతో పెద్దప్రమాదం తప్పింది.

ఫొటోగ్రాఫర్ మృతి

ముదిగొండ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం బాణాపురం గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ మరికంటి నాగేశ్వరరావు(38) హైబీపీతో బుధవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. నాగేశ్వరరావు కుటుంబానికి ఖమ్మంజిల్లా ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అధ్యక్షుడు మారగాని వెంకట్ తక్షణ సాయం కింద రూ.పదివేలను అందజేశారు. నాగేశ్వరరావు కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా నాయకులు తిరుపతిరావు, రఘు, రంజిత్, అనిల్ పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ ఎన్నిక

బోనకల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబీరవల్లి గ్రామంలో బుధవారం మధిర నియోజకవర్గ నూతన పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీని ఎన్నుకున్నారు. ఆ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడిగా వాక్‌దాని పుల్లారావు, కార్యదర్శిగా గొల్లమందల దయాకర్, ట్రెజరర్‌గా ఆదాం ఎలీషా, జాయింట్ సెక్రటరీగా దానియేలు, ఉపాధ్యక్షుడిగా ఎన్. బాబురావులు ఎన్నిక కాబడ్డారు. ఈ సమావేశంలో ఐదు మండలాల ఫెలోషిప్ నాయకులు ఎం. కృపాకర్, తిమోతి, జీవరత్నం, సురేష్, వీరయ్య, సుదాకర్, జామవా, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

1200మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం

సత్తుపల్లిరూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి నియోజకవర్గంలో ఇప్పటికే గుర్తించిన 22పోలింగ్ కేంద్రాల్లో 1200మంది ఓటర్లు దాటటంతో కొత్తగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు కల్లూరు ఆర్డీఓ రాజేందర్‌గౌడ్ తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన రాజకీయ పార్టీలకు చెందిన నియోజకవర్గ స్థాయి నాయకులతో సమావేశమయ్యారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 18సంవత్సరాలు నిండిన అర్హత కలిగిన కొత్త ఓటర్ల నమోదు, స్పెషల్ ఇంటన్సివ్ రివిజన్-2025 చేశారు.

ఎస్టీ హాస్టల్ తనిఖీ

మండల తహసీల్దార్ సత్యనారాయణ బుధవారం మధ్యాహ్నం పట్టణంలోని ఎస్టీ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి ఆరోగ్య సూత్రాలను వివరించిన అనంతరం వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

భూములు కోల్పోయిన రైతులకు పరిహారమివ్వాలి: బీజేపీ

మధిర రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నాగపూర్-అమరావతి జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన పలువురు రైతులకు కేంద్ర ప్రభుత్వం న్యాయమైన పరిహారం ఇచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, అలసత్వం కారణంగా కొంతమంది రైతులకు నష్టం జరిగి పరిహారం అందలేదని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మధిర మండలంలోని ఆత్కూరు, ఖాజీపురం గ్రామాల్లో హైవే కింద భూములు కోల్పోయిన రైతుల సమస్యలను బీజేపీ నాయకులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు సమస్యలను బీజేపీ నాయకులకు విన్నవించారు. మాటూరు, ఖాజీపురం రెవెన్యూల్లో 200ఎకరాల భూములను రైతులు దశాబ్దకాలంగా సాగుచేసుకుంటున్నారని, పట్టాదారు పాస్‌పుస్తకాలు కూడా ఉన్నాయని, ధరణి పోర్టల్‌లో మాత్రం ఆభూములు వక్ఫ్‌బోర్డుగా నమోదు కావడంతో తాము అవస్థలు పడుతున్నామని బీజేపీ నాయకులకు వివరించారు. అనంతరం శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పొలం రికార్డులను సరిచేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఇంకా అవి వక్ఫ్‌బోర్డు కిందనే చూపిస్తున్నాయని, రైతులకు అందాల్సిన పరిహారం వక్ఫ్‌బోర్డు ఖాతాల్లో జమకావడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా అధికారులు తక్షణమే స్పందించి రైతులకు న్యాయం చేయాలని లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, నాయకులు సుమంత్, రామిశెట్టి నాగేశ్వరరావు, స్వర్ణాకర్, కుంచం కృష్ణారావు, రమేష్, శంకర్ పాల్గొన్నారు.

సత్తుపల్లి పట్టణ శివారుల్లో ట్రాఫిక్ సమస్య

» రహదారికి ఇరువైపులా భారీగా వాహనాల పార్కింగ్

» ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని యంత్రాంగం

సత్తుపల్లిరూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణ శివారుల్లో ట్రాఫిక్ సమస్యతో స్థానికులు నిత్యం అవస్థలు పడుతున్నారు. సత్తుపల్లి నుంచి హైదరాబాద్, వైజాగ్, రాజమండ్రి, విజయవాడ, భద్రాచలంతోపాటు ఇతర రాష్ట్రాలకు వెళ్లే లారీలు, ఇతర వాహనాలు రాత్రీపగలూ తేడా లేకుండా నిత్యం వేలాదిగా రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే రాత్రి బస చేసేందుకు ఎన్టీఆర్ నగర్, జేవీఆర్ పార్క్, అంబేద్కర్ విగ్రహం నుంచి జ్యోతి నిలయం స్కూల్ వరకు నిత్యం వందలాది వాహనాలు రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేస్తున్నారు. అయితే జాతీయ రహదారి కావడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రతరమవుతుంది. అడ్డగోలుగా రోడ్డు పక్కన పార్కింగ్ చేస్తుండటంతో రహదారి కుచించుకుపోయి తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఎన్టీఆర్ నగర్‌లో స్థానికులతోపాటు ఇతర ప్రాంతాలకు వెళ్లే లారీలు, సెప్టిక్ ట్యాంకులు ఇక్కడే నిలిపి ఉండటంతో రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. నిబంధనలు పాటించకుండా వాహనాలు నిలుపుతున్నారని, వాహనాల మాటున సేదతీరే వీధి కుక్కలు, కోతులు ఒక్కసారిగా రోడ్లపైకి రావడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై కాళ్లుచేతులూ విరగకొట్టుకుంటున్న సందర్భాలు చాలానే ఉన్నాయి. ఇంకా వర్షాలు వస్తే అక్కడ రహదారి ఆసాంతం బురదమయంగా మారుతుండగా ప్రయాణానికి ప్రాణసంకటంగా మారుతుంది. ఇదే విషయమే పట్టణ సీఐ టీ.శ్రీహరిని వివరణ కోరగా పరిశీలించి బ్లూకోట్స్ సిబ్బందిచేత ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో పాటు వాహనాల పార్కింగ్ చేయకుండా చూస్తామని చెప్పారు.



ఎన్టీఆర్ నగర్ టర్నింగ్‌లో లారీల పార్కింగ్



జేవీఆర్ పార్క్ టర్నింగ్‌లో



హిందూ శ్మశాన వాటిక వద్ద